మా అక్షరాలు - నిజాల నిప్పుకణికలు

# ప్రజా మంటలు

తెలంగాణ జాతీయ దినపత్రిక

సంపుటి : 5 పేజీలు - 8
సంచిక : 183 వెల - రూ 5:00

Email: prajamantalu@gmail.com www.prajamantalu.com ఎడిటర్: సిహెచ్.వి. ప్రభాకర్ రావు

Published From Jagithyal, Circulated to Jagtial, Jangaon,Jayashankar Bhoopalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahabubnag Medak,Medchal, Nagarkurnool, Nalgonda, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla,Rangareddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal (Rural), Warangal (Urban), Yad



ప్రజా మంటలు
తెలంగాణ జాతీయ దినపత్రిక

విలేఖరులు కావలెను
ప్రజా మంటలు జాతీయ దినపత్రికలో నిర్భయంగా
వార్తలు, విశ్లేషణలు రాయగల యువకులు విలేఖరులు
చిత్తశుద్ధితో పనిచేయగల వారు.
మీ పూర్వ అనుభవంతో సంప్రదించండి.
వివరాలకు కింది ఫోన్ నం లను సంప్రదించండి.
9989326427, 8103194733.



# జాతీయ విపత్తుగా ప్రకటించండి

- బురద రాజకీయాలు వద్దు
- ప్రతిపక్షాలకు సీఎం రేవంత్‌రెడ్డి హితవు
- బాధితులందరినీ ఆదుకుంటామని హామీ
- వరదలపై అధికారులు, మంత్రులతో సమీక్ష
- కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి సీఎం రేవంత్ సమీక్ష

హైదరాబాద్, (ప్రజా మంటలు): రాష్ట్ర వ్యాప్తంగా భారీగా వర్షాలు కురుస్తున్నాయి. ప్రాజెక్టుల్లోకి వరద నీరు వచ్చి చేరుతుండటంతో ఆయా ప్రాజెక్టుల గేట్లను అధికారులు ఎత్తివేసి నీటిని దిగువకు విడుదల చేస్తున్న పరిస్థితి. భారీ వర్షాలకు వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. వర్షాలతో అప్రమత్తమైన అధికారులు ప్రజలకు నష్టం కలగకుండా తగు చర్యలు తీసుకుంటున్నారు. మరోవైపు రాష్ట్రంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలపై సీఎం రేవంత్ రెడ్డి అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు. కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించగా...

మిగతా 2లో..

## తక్షణమే రూ. 2 వేల కోట్లు కేటాయించండి

**- జాతీయ విపత్తుగా ప్రకటించండి - వరద బాధిత ప్రాంతాల్లో పర్యటించండి**

**- ప్రధాని మోదీకి సీఎం లేఖ**

హైదరాబాద్, (ప్రజా మంటలు): తెలంగాణలోని వరద ముంపు ప్రాంతాల్లో పర్యటించాలని కోరుతూ ప్రధాని నరేంద్ర మోదీ కి సీఎం రేవంత్‌రెడ్డి లేఖ రాశారు. వరదలను జాతీయ విపత్తుగా పరిగణించాలని అందులో పేర్కొన్నారు. రాష్ట్రానికి తక్షణ సాయం అందజేయాలని లేఖలో కోరారు. రాష్ట్రంలో రూ. 5 వేల కోట్ల నష్టం జరిగిందని ప్రాథమిక అంచనా వేస్తున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. తక్షణమే కేంద్రం రూ. 2 వేల కోట్లు కేటాయించాలని కోరారు. జరిగిన నష్టాన్ని పరిశీలించడానికి ప్రధాన మోదీని ఆహ్వానించారు.

## హైకోర్టులో స్మితా సబర్వాల్‌కు ఊరట
## పిటిషన్లను కొట్టివేసిన హైకోర్టు



హైదరాబాద్, (ప్రజా మంటలు): సివిల్ సర్వీసెస్ అయినఐఏఎస్, ఐపీఎస్, ఐఆర్ఎస్లకు వికలాంగుల కోటా అవసరమా అంటూ ఐఏఎస్ స్మితా సబర్వాల్ చేసిన కామెంట్స్ పెను దుమారం రేపిన సంగతి తెలిసిందే. వికలాంగులపై స్మితా సబర్వాల్ చేసిన ఈ వ్యాఖ్యలపై పెద్ద ఎత్తున విమర్శలు వ్యక్తం అయ్యాయి. అత్యున్నత పదవిలో ఉండి స్మితా సబర్వాల్ ఇలా వ్యాఖ్యానించడం సరికాదంటూ పలువురు రాజకీయ నేతలు, మేధావులు సైతం ఆమె వ్యాఖ్యలను తప్పుబట్టారు. చివరకు స్మితా చేసిన వ్యాఖ్యలు తెలంగాణకు హైకోర్టు వరకు చేరాయి. వికలాంగులను కించపరిచేలా వ్యాఖ్యలు చేసిన స్మిత సబర్వాల్‌పై చర్యలు తీసుకోవాలని హైకోర్టులో పిటిషన్ దాఖలు అయ్యింది. దీనిపై సోమవారం విచారణ చేపట్టిన హైకోర్టు.. స్మితా సబర్వాల్‌కు వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్‌ను కొట్టేసింది. ఈ పిటిషన్‌కు విచారణ అర్హత లేదని హైకోర్టు తోసిపుచ్చింది. హైకోర్టు పిటిషన్‌ను కొట్టివేయడంతో దివ్యాంగులపై కాంట్రవర్సీ కామెంట్స్ ఇష్యూలో స్మితాకు భారీ ఊరట దక్కింది.

## పొలిట్రిక్స్

జైలైనా, బెయిలైనా
సంబరాల పండగే ,
టపాసుల మోతతో
'వార్నింగు'లు దండగే !

ఇల్లు అలకగానే
పండగ అయిపోదులే,
'నిర్దోషి'గా నిరూపణకు
'దారు'లేవో వెతకాలే!

- న్యాలకంటి నారాయణ
9346200066

## 'హైడ్రా'కు తాత్కాలిక బ్రేక్

**- వర్షాల కారణంగా పనుల నిలిపివేత**



హైదరాబాద్, (ప్రజా మంటలు): చెరువులు, నాలాలు కబ్జా చేసి నిర్మించిన కట్టడాలను హైడ్రా కూల్చివేయడం రాష్ట్రంలో సంచలనంగా మారింది. అయితే ప్రస్తుతం కూల్చివేతలకు హైడ్రా కాస్త బ్రేక్ ఇచ్చింది. భారీ వర్షాల నేపథ్యంలో గ్రేటర్ పరిధిలో మాన్సూన్ సహాయక చర్యల్లో హైడ్రా బృందాలు బిజీ ఉన్నాయి. అలాగే హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ కూడా బిజీగా ఉన్నారు. వర్షం ఉన్న సమయంలో వాటర్ లాగిన్ పాయింట్స్, లోతట్టు ప్రాంతాల్లో పర్యటిస్తున్నారు. ఆ ప్రాంతాలు నీట మునిగేందుకు గల కారణాలపై ఆరా తీస్తున్నారు. చెరువుల పక్కన నిర్మించిన కాలనీల్లో పర్యటిస్తున్నారు. నీరు ఉన్నప్పుడే ఆ ప్రాంతాలను సందర్శించి మార్క్ చేసుకుంటున్నారు. తర్వాత నోటీసులు అందజేసే అవకాశం ఉంది. అలాగే ఎఫ్టీఎల్ పరిధిలో నిర్మాణాలు చేపట్టిన వారికి ఇరిగేషన్, రెవెన్యూ, మున్సిపల్ అధికారులు నోటీసులు అందజేస్తున్నారు. నోటీసులు తీసుకున్న వారు వారం రోజుల్లో ఇళ్లు ఖాళీ చేయాలని అందులో స్పష్టం చేశారు. హెచ్ఎండీఏ పరిధిలో ఇప్పటికే 200కు పైగా అక్రమ నిర్మాణాలు కూల్చివేసినట్టు తెలుస్తోంది. సీఎం రేవంత్ రెడ్డి సోదరుడు తిరుపతి రెడ్డికి చెందిన ఇల్లు, ఆఫీసుకు కూడా హైడ్రా అధికారులు నోటీసులు అందజేశారు. చట్టం ముందు అందరూ సమానమేనని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. వర్షాలు తగ్గుముఖం పట్టిన తర్వాత కూల్చివేతల పనిలో హైడ్రా బిజీగా ఉండనుంది.

## వరదలను రాజకీయం చెయ్యొద్దు

**- బాధితులకు ప్రతి ఒక్కరూ అండగా ఉండాలి**


**- వర్షాలతో 16మంది మృతి..**

**- బాధిత కుటుంబాలను ఆదుకుంటాం: శ్రీధర్‌బాబు**



హైదరాబాద్, (ప్రజా మంటలు): భారీ వర్షాలకు సర్వస్వం కోల్పోయి రోడ్డున పడ్డ కుటుంబాలను ప్రభుత్వం ఆదుకుంటుందని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. సోమవారం ఆయన వర్షాలకు నష్టపోయిన ప్రాంతాలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. అధికారులు సెలవులు రద్దు చేసుకొని క్షేత్రస్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. వర్షాలపై ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలన్నారు. వానలతో ప్రాణాలు కోల్పోయిన బాధిత కుటుంబాలను ఆదుకుంటామని పేర్కొన్నారు. అలాగే అత్యవసరమైతే తప్పా బయటకు రావొద్దన్నారు. కాగా, భారీ వర్షాల నేపథ్యంలో అత్యవసరమైతే తప్ప ప్రజలు బయటకి రావొద్దని అధికారులు హెచ్చరించారు. లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఏ అవసరం వచ్చినా అధికారులకు ఫోన్‌లో సమాచారం ఇవ్వాలన్నారు. రాష్ట్రంలో వర్షాలకు దెబ్బతిన్న ప్రాంతాలపై అధికారులతో సమీక్షించినట్లు తెలంగాణ మంత్రి శ్రీధర్ బాబు వెల్లడించారు. ఎనిమిది జిల్లాలపై తీవ్ర వర్ష ప్రభావం పడిందన్నారు. వర్షాలతో ఇప్పటివరకు 16 మంది మృతి చెందారన్న ఆయన.. ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలను ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. అవసరమైతే తప్ప ప్రజలు బయటకు రావొద్దని విజ్ఞప్తి చేశారు. 'అధికారులంతా క్షేత్రస్థాయిలో ఉండి పరిస్థితులను సమీక్షించాలి. విద్యుత్తు, రహదారులను వెంటనే పునరుద్ధరించాలని కోరాం. రాష్ట్ర స్థాయిలో డిజాస్టర్ రెస్పాన్స్ బృందాన్ని ఏర్పాటు చేస్తాం. పది బృందాలను అత్యవసర పరిస్థితుల్లో వాడుకోవాలని నిర్ణయించాం. ప్రతిపక్ష నేతలు కూడా సహాయ కార్యక్రమాల్లో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. ఇది రాజకీయం చేయాల్సిన సమయం కాదన్నారు. ప్రజలు ఆదుకోవడంలో ప్రతి ఒకకరూ ముందుండాలని అన్నారు.

## ప్రజా నాడి




## గోదావరి నది పరివాహక ప్రాంతాలను పరిశీలించిన జిల్లా కలెక్టర్ బీ. సత్య ప్రసాద్, ఎస్పి అశోక్ కుమార్



జగిత్యాల సెప్టెంబర్ 02 (ప్రజా మంటలు) : ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో అధికారులు శ్రీరామ్ సాగర్ ప్రాజెక్ట్,కడెం ప్రాజెక్టుల గేట్లు ఎత్తి నందున ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని ముఖ్యంగా రైతులు, చేపలు పట్టేవారు, పశువుల కాపరులు నదిలోకి దిగవద్దని కలెక్టర్ సూచించారు. ప్రజలు అధికారులకు సహకరించాలి అని తెలిపారు. భారీ వర్షాల దృష్ట్యా జిల్లా ప్రజలు అప్రంతంగా ఉండాలి. ఇబ్రహీంపట్నం మండలంలోని,ఎర్దండి, కోమటి కొండాపూర్, మూలరాంపూర్ గ్రామాల్లోని గోదావరి నది,పరివాహక. ప్రాంతాలను చెరువులు, వాగుల కుంటలను సందర్శించారు. జిల్లాలోని వివిధ గ్రామాలను పరిశీలించిన కలెక్టర్, ఎస్పి ప్రజలకు అధికారులు అండగా ఉంటారని, ఎలాంటి భాయాణదోళనకు గురికావద్దని, అప్రమత్తంగా ఉంది, అవసరమైనపుడు అధికార్యలకు సమాచారం చెరవేయాలని సూచించారు. 24 గంటలపాటు నీటి వనరులపై నిఘా పెట్టాలని, ముంపు ప్రాంతాల్లో అధికారులు,సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆయన ఆదేశించారు. జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ జగిత్యాల్ ఆర్డిఓ మరియు డిఎస్పి మున్సిపల్ కమిషనర్, టెంపుల్ ఏవో ఎమ్మార్వో ఎంపీడీవో వివిధ శాఖ అధికారులు పాల్గొన్నారు.



## ధర్మపురిలోని గోదావరి నది పరివాహక ప్రాంతాన్ని పరిశీలించిన ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్

గొల్లపల్లి సెప్టెంబర్ 02 (ప్రజా మంటలు) : అడిషనల్ కలెక్టర్,డీఎస్పీ మండల అధికారులు, నాయకులతో కలిసి ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పరిశీలించారు. ఈ సంధర్భంగా అధికారులతో మాట్లాడి తీసుకుంటున్న సహాయక చర్యలపైన వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సంధర్భంగా వారు మాట్లాడుతూ, గోదావరి పరివాహక ప్రాంతంలో ఉన్న ప్రజలు అప్రమత్తంగా ఉండాలని,కడెం ప్రాజెక్ట్ గేట్ల ఎత్తడం వల్ల గోదావరి వరద ఉధృతి పెరిగే అవకాశం ఉందని కాబట్టి తీర ప్రాంత ప్రజలు ప్రభుత్వం ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలకు వెళ్ళాలని,అట్టి కేంద్రాల్లో ప్రభుత్వం అన్ని రకాల వసతులు కల్పించిందని,ఎవ్వరు అధైర్య పడాల్సిన అవసరం లేదనీ మీకు ఎల్లవేళలా సహాయ సహకారాలు అందించడానికి అధికారులు,మా పార్టీ నాయకత్వం అందుబాటులో ఉందని తెలిపారు.



మొదటి పేజీ తరువాయి

# జాతీయ విపత్తుగా ప్రకటించాలి



- ప్రజలకు అందుబాటులో ఉండాలని అధికారులకు ఆదేశం
- రూ. 5 వేల కోట్లకుపైగా నష్టం జరిగిందని ప్రాథమిక అంచనా
- ప్రతీ కుటుంబానికి తక్షణమే రూ.10 వేల తక్షణసాయం
- మృతుల కుటుంబాలకు రూ.5లక్షలు
- పశువులకు రూ.50వేలు, మేకలు,గొర్రెలకు రూ.5వేలు
- పంటనష్టపోయిన ఎకరాకు రూ.పదివేల పరిహారం
- ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, సూర్యాపేట జిల్లాలకు రూ.5 కోట్లు చొప్పున సాయం
- ఇంటింటికి తిరిగి బాధితులకు నిత్యావసరాలు అందించాలి
- మంత్రులతో కలసి ఖమ్మంలో ముఖ్యమంత్రి రేవంత్ పర్యటన
- భవిష్యత్ అవసరాల కోసం తెలంగాణ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ సంస్థ ఏర్పాటు

మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, శ్రీధర్ బాబు, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి,డీజీపీ జితేందర్, వివిధ శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు. వరద సహాయక చర్యల పరిస్థితిపై సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో అత్యధికంగా ఖమ్మం జిల్లాల్లో వర్ష పాతం నమోదు అయిన విషయం తెలిసిందే. వర్షాలకు పలు నదులు, వాగులు, చెరువులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. వర్షాల కారణంగా ఇప్పటి వరకు పది మంది మృతువాత పడ్డారు. అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, సీపీలతో ఎప్పటికప్పుడు సీఎం మానిటరింగ్ చేస్తున్నారు. ఏజెన్సీ ప్రాంతంలోని ప్రజలకు మరింత అందుబాటులో ఉండాలని సూచించారు. వర్షాల వల్ల నీట మునిగిన పంట పొలాలపై ముఖ్యమంత్రి ఆరా తీశారు. జిల్లాల నుంచి వచ్చే ఫీడ్ బ్యాక్ కోసం సచివాలయంలో టోల్ ఫ్రీ నంబర్ 040 – 23454088 ఏర్పాటు చేశారు. భారీ వర్షాలపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ... ఈ విపత్కర పరిస్దితిలో యావత్ ప్రభుత్వం ప్రజలకు అండగా నిలబడింద న్నారు. ప్రతి ఒక్క కుటంబాన్ని ఆదుకుంటామని స్పష్టం చేశారు. వరదలలో ప్రాణ నష్టం, ఆస్తి నష్టంతో పాటు నష్టపోయిన కుటుంబాలకు అండగా నిలబడతామన్నారు. ఆపదలో ఉన్న ప్రజలకు అండగా నిలవాల్సిన సమయంలో ప్రతిపక్షం తన భాద్యత మరచి అర్దం లేని ఆరోపణలు చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతిపక్షనేతల ట్విట్టర్, ఎక్స్ కూతలను పట్టించుకోవాల్సిన పనిలేదన్నారు. తమకు ప్రజలు ముఖ్యమని.. వారి ప్రాణాలు ముఖ్యమన్నారు. ప్రతి ఒక్కరినీ కాపాడుకుంటామని.. ప్రజలు అధైర్యపడవద్దని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పేర్కొన్నారు. భారీ వర్షాల నేపథ్యంలో అధికారులు 24 గంటలు అప్రమత్తంగా ఉండి క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ సహాయ చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ఎవరూ సెలవులు పెట్టొద్దని, సెలవులు పెట్టినవారు వెంటనే రద్దు చేసుకొని విధుల్లో నిమగ్నం కావాలని అధికారులకు సూచించారు. జిల్లాల్లో కలెక్టర్లు, ఎస్పీలు, రెవెన్యూ, ఇరిగేషన్, మున్సిపల్ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలని సూచించారు. అత్యవసర విభాగాల అధికారులు క్షేత్రస్థాయిలో అంటూ ఎప్పటికప్పుడు సమాచారాన్ని సీఎంవోకు పంపాలని ఆదేశించారు. భారీ వర్షాలతో వచ్చిన వరద నీటిని వృథా చేయకుండా భవిష్యత్తు అవసరాలకు వినియోగించుకోవాలని ఆదేశించారు. నంది, గాయత్రి పంప్‌హౌస్‌ల ద్వారా లిఫ్ట్‌చేసి రిజర్వాయర్లు నింపాలని ఆదేశించారు. మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు స్థానికంగా ఉంటూ సహాయక కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. 24 గంటలు అలర్ట్‌గా ఉంటూ సహాయ కార్యక్రమాల్లో పాలుపంచుకోవాలని కాంగ్రెస్ కార్యకర్తలను రేవంత్‌రెడ్డి కోరారు.ఖమ్మం నుంచి ఆదిలాబాద్ వరకు గోదావరి నది తీరం వెంబడి అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార ఆదేశించారు. ఖమ్మం కలెక్టరేట్ నుంచి కలెక్టర్లు, రాష్ట్ర ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. బారీ వర్షాల నేపథ్యంలో వినియోగదారులకు అంతరాయం తలెత్తకుండా విద్యుత్తునందించాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. ఆదివారం మధిర తహసీల్దార్ కార్యాలయం నుంచి టీజీఎస్పీడీసీఎల్ సంస్థ ఎస్ఈలు, డీఈలతో వీడియో కాన్ఫరెన్స్‌ను

నిర్వహించారు. ఈ సందర్భంగా నీట మునిగిన సబ్‌స్టేషన్ల వివరాలు తెలుసుకుని, విద్యుత్తు పునరుద్ధరణకు కలెక్టర్లు, పోలీసు, రెవెన్యూశాఖలతో సమన్వయం చేసుకోవాలని తెలిపారు. తమ విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించే అధికారులు, సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రాష్ట్రంలో 45 పునరావాస కేంద్రాలను తెరచి, 2,500 మందికిపైగా తరలించామని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఇప్పటివరకు 85 చెరువులు, కుంటలు, కాలువలకు గండ్లు పడ్డాయని ప్రాథమిక సమాచారం అందిందని చెప్పారు. వరద తీవ్రత అధికంగా ప్రాంతాలకు ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలతోపాటు సహాయసహకారాలు అందిస్తున్నామని చెప్పారు. తన నియోజకవర్గమైన పాలేరులోని కూసుమంచి మండలం నాయకన్‌గూడెంకు చెందిన ఇటుకలపని చేసుకొనే యాకూబ్, ఆయన భార్య సైదాబీ వరదల్లో కొట్టుకోపోవడంపై మంత్రి శ్రీనివాసరెడ్డి భావోద్వేగానికి గురయ్యారు. అన్ని ఉన్నా కూడా వాతావరణం అనుకూలించక వారిని రక్షించుకోలేకపోయానని ఆవేదన వ్యక్తంచేశారు. భారీ వర్షాల నేపథ్యంలో అదనంగా తొమ్మిది ఎన్డీఆర్ఎఫ్ బృందాలు రాష్ట్రానికి రానున్నాయి. చెన్నై, వైజాగ్, అసోం నుంచి మూడు చొప్పున మొత్తం 9 ఎన్డీఆర్ఎఫ్ బృందాలను తెలంగాణకు పంపాలని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ఉన్నతాధికారులను ఆదేశించారు. ఆదివారం కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ రాష్ట్రంలో కురుస్తున్న కుంభవృష్టి వానలు, వరదల తీవ్రతను అమిత్‌షా దృష్టికి తీసుకెళ్లడంతో తెలంగాణకు ఎన్డీఆర్ఎఫ్ బృందాలను పంపిస్తున్నట్టు చెప్పారు. భారీ వర్షాల నేపథ్యంలో రాష్ట్రంలోని అన్ని విద్యాసంస్థలకు ప్రభుత్వం సోమవారం సెలవు ప్రకటించింది. అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలు తప్పనిసరిగా సెలవులివ్వాలని ప్రభుత్వం స్పష్టంచేసింది. ఓయూతో పాటు మహాత్మాగాంధీ వర్సిటీ, తెలంగాణ వర్సిటీ, జేఎన్టీయూ సోమవారం జరగాల్సిన పరీక్షలను అధికారులు వాయిదావేశారు. మంగళవారం వర్షాలు తగ్గకపోతే, వాతావరణ పరిస్థితులను బట్టి నిర్ణయం తీసుకోనున్నారు.

**అధికారులు అప్రమత్తంగా ఉండండి**

హైదరాబాద్‌లో ట్రాఫిక్ సమస్య లేకుండా కమిషనర్లు చూడాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. వర్షాల వల్ల దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేయాలన్నారు. విద్యుత్ సరఫరా సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం ఖమ్మంలోని వరద ప్రభావిత ప్రాంతాలను పరిశీలించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి రోడ్డు మార్గంలో బయలుదేరారు. మార్గమధ్యలో కోదాడలో ముంపు ప్రాంతాలను ఆయన పరిశీలించారు. మంగళవారం మహబూబాబాద్ జిల్లాలో సీఎం పర్యటించనున్నారు. తెలంగాణలో వరద సాయంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వరదల్లో చనిపోయిన వారి కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా పెంచుతూ కీలక ప్రకటన చేశారు. వరదల కారణంగా చనిపోయిన వారి కుటుంబాలకు ఆర్థిక సాయం 4 లక్షల నుంచి 5 లక్షలకు పెంచుతూ సీఎం నిర్ణయం తీసుకున్నారు. సోమవారం కమాండ్ కంట్రోల్ రూంలో వర్షాలపై సమావేశం నిర్వహించారు. చనిపోయిన పాడి గేదెలు ఒక్కో దానికి ఇచ్చే ఆర్థిక సాయాన్ని రూ. 30 వేల నుంచి రూ. 50 వేలకు పెంచాలని, మరణించిన మేకలు, గొర్రెలకు ఒక్కోదానికి ఇచ్చే రూ. 3 వేల సాయం రూ.5 వేలకు పెంచాలని సీఎం ఆదేశించారు. తక్షణం బాధిత కుటుంబాలకు అందించాలని సూచించారు. వర్షాలు, వరదల కారణంగా పూర్తిగా దెబ్బతిన్న పంటలకు ఒక్కో ఎకరానికి రూ. 10 వేల చొప్పున పంట నష్ట పరిహారం అందించేందుకు తక్షణ ఏర్పాట్లు చేయలని ఆదేశించారు. కంటింజెన్సీ ఫండ్ కింద ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, సూర్యాపేట జిల్లా కలెక్టర్లకు ఒక్కొక్కరికి రూ.5 కోట్లు వెంటనే విడుదల చేస్తున్నట్లు ముఖ్యమంత్రి ప్రకటించారు. రాష్ట్రంలోనే కాకుండా, జిల్లా కేంద్రాల్లో కంట్రోల్ రూంలు 24 గంటలు పని చేసే విధంగా ఏర్పాట్లు చేయాలని సీఎం ఆదేశించారు. అధికారులందరూ అప్రమత్తంగా ఉండాలని, వెంటనే క్షేత్రస్థాయి పర్యటనలు చేయాలని చెప్పారు. ప్రజలకు ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని, నిత్యావసర వస్తువుల పంపిణీ,, సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా చూడాలని ఆదేశించారు. భారీ వర్షాలు, వరదలతో వాటిల్లిన నష్టంపై అన్ని విభాగాల నుంచి ప్రాథమిక నివేదికలు తెప్పించి, కేంద్ర ప్రభుత్వం నుంచి తక్షణ సాయం కోరేందుకు నివేదికను సమర్పించాలని ఆదేశించారు. రాష్ట్రంలో జరిగిన ఈ ప్రకృతి వైపరీత్యాన్ని జాతీయ విపత్తుగా ప్రకటించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతూ లేఖ రాయాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వ అధికార బృందాలతో పాటు స్వయంగా ప్రధాన మంత్రి ఈ విపత్తును పరిశీలించేందుకు రావాల్సిందిగా ముఖ్యమంత్రి ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు. భవిష్యత్తులో ఇలాంటి విపత్తులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు తెలంగాణ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ ను ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి నిర్ణయం తీసుకున్నారు. 25 పెద్ద టవర్లు కూలిపోయినప్పటికీ విద్యుత్తు సిబ్బంది వెంటనే కరెంట్ సరఫరాను పునరుద్ధరించారని గుర్తు చేశారు. అదే విధంగా 24 గంటలు అప్రమత్తంగా ఉండాలని, విద్యుత్తు సమస్యలు, ప్రమాదాలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించారు. లోతట్టు ప్రాంతాల్లో ఉన్న వారిని గుర్తించి తక్షణమే పునరావాస కేంద్రాలకు తరలించి నష్టాలను నివారించాలని చెప్పారు. వాగులు, వంకలు పొర్లుతున్న దృష్ట్యా దెబ్బతిన్న రోడ్లు, వరద ప్రవహిస్తున్న రోడ్లపై నుంచి ఎవరూ దాటే ప్రయత్నం చేయవద్దని హెచ్చరించారు. రెవిన్యూ, పోలీసు, ఇతర విభాగాల అధికారులు బృందాలు ఏర్పడి అన్ని చోట్ల తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. తెలిపారు.

**సూర్యాపేటకు తక్షణ సాయం కింద రూ.5కోట్లు**

రాష్ట్రంలో రూ. 5 వేల కోట్ల నష్టం జరిగిందని ప్రాథమిక అంచనా వేస్తున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. తక్షణమే కేంద్రం రూ. 2 వేల కోట్లు కేటాయించాలని కోరామని పేర్కొన్నారు. జరిగిన నష్టాన్ని పరిశీలించడానికి ప్రధాన మోదీని ఆహ్వానించామని సీఎం చెప్పారు. ఖమ్మం జిల్లాకు వెళ్తున్న సీఎం రేవంత్ రెడ్డి.. సూర్యాపేట జిల్లాలో కాసేపు ఆగారు. జిల్లాలో జరిగిన పంట, ఆస్తి నష్టం వివరాలను సీఎం అడిగి తెలుసుకున్నారు. నష్టానికి సంబంధించి ఫోటో ఎగ్జిబిషన్‌ను తిలకించారు. సాగర్ ఎడమకాలువ తెగడం వల్ల జరిగిన పంట నష్టంపైన ముఖ్యమంత్రి ఆరా తీశారు. సూర్యాపేట జిల్లాలో 30 సెం.మీ. అతి భారీ వర్షం కురిసిందన్నారు. అధికారులు నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉన్నారని తెలిపారు. పంట, ఆస్తి నష్టం పైన అధికారులు ప్రాథమిక నివేదిక ఇచ్చారు. మంత్రులు, ప్రజాప్రతినిధులను క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉంచామన్నారు. ప్రాణ,ఆస్తి నష్టం జరగకుండా ప్రజాప్రతినిధులు, అధికారులు జాగ్రత్తలు తీసుకుంటున్నారని సీఎం పేర్కొన్నారు. ఖమ్మం, నల్లగొండ పరిస్థితి పైన ప్రధాని మోదీ, అమిత్ షా, రాహుల్ గాంధీకి వివరించి సాయం కోరినట్లు సీఎం తెలిపారు.

**మంత్రులతో కలసి ఖమ్మంలో సిఎం రేవంత్ పర్యటన**

వరదలకు నష్టపోయిన ప్రతీ కుటుంబానికి తక్షణమే రూ.10 వేల తక్షణ సాయం అందిస్తామని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఖమ్మం జిల్లా వరద ప్రాంతాల్లో మంత్రులతో కలసి సిఎం రేంవత్ పర్యటించారు. భారీ వర్షాలకు అతాలకుతలం అయిన ఖమ్మం జిల్లాలో సీఎం రేవంత్ రెడ్డి పర్యటించారు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క , మంత్రులు పొంగులేటి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి,ఉత్తమ్ కుమార్ రెడ్డి వెంట ఉన్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన రేవంత్..మున్నేరు వరద వందలాది కుటుంబాల్లో విషాదం నింపిందన్నారు. వరదలో నష్టపోయిన కుటుంబాలను ఆదుకుంటామన్నారు. ఇంటింటికి తిరిగి నిత్యవసర సరుకులు ఇవ్వాలని కలెక్టర్ ను ఆదేశించారు. అధికారులు ఇంటింటికి తిరిగి నష్టం అంచనా వేస్తారని చెప్పారు. కాంగ్రెస్ కార్యకర్తలు బాధితులకు అండగా నిలవాలని సూచించారు సీఎం రేవంత్. రూ.650 కోట్లతో మున్నేరు వాగు రిటైనింగ్ వాల్ నిర్మాణం చేపడతామని చెప్పారు. ప్రాణ నష్టం వాటిల్లిన కుటుంబానికి రూ.5 లక్షలు ఇవ్వాలని కలెక్టర్లను ఆదేశించారు సీఎం. మిమ్మల్ని ఆదుకునేందుకు ప్రభుత్వం కదిలివచ్చిందన్నారు. నష్టపోయిన బాధితులను సంపూర్ణంగా ఆదుకునే బాధ్యత ప్రభుత్వానిదన్నారు. కూసుమంచి మండలం నాయకన్ గూడెం దగ్గర వరద ఉధృతితో ఖమ్మం – సూర్యపేట జాతీయ రహదారిపై కొట్టుకపోయిన బ్రిడ్జిని సిఎం పరిశీలించారు.అలాగే పాలేరు రిజర్వాయర్ ను పరిశీలించారు. రాత్రి సీఎం రేవంత్ ఖమ్మంలోనే బస చేయనున్నారు. భారీ వర్షాలకు ఉదయం పాలేరు బ్రిడ్జి తెగిపోయిన సంగతి తెలిసిందే. దీంతో ఏపీ తెలంగాణ మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. మరో వైపు వరద ప్రభావిత మృతులకు ఎక్స్ గ్రేషియా 4 లక్షల నుంచి 5 లక్షలకు పెంచుతున్న ప్రకటించారు. వరదలకు ఇల్లు కోల్పోయిన వారికి ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని చెప్పారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో భారీ వానలు, వరదలు బీభత్సం సృష్టిస్తున్నాయి. ఖమ్మం జిల్లా కేంద్రం, మణగూరు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. శనివారం నుంచి కురుస్తున్న వర్షాలతో ఆదివారం ఖమ్మం నగరంలోని పలు కాలనీల్లోకి వరద నీరు చేరింది. మున్నేరును ఆనుకున్న లోతట్టు కాలనీలతో పాటు, లకారం చెరువును ఆనుకొని ఉన్న కాలనీల్లోకి కూడా వరద నీరు చేరింది. నగరంలోని కవిరాజ్ నాగర్, నయాబజార్, ప్రకాశ్ నగర్ చవ÷–టా ప్రాంతాల్లో ఇండ్లలోకి నీళ్లు వచ్చాయి. నగరంలోని పలు కాలనీల నుంచి లకారం చెర్వులోకి వెళ్లే నాలాలను కబ్జా చేసి, నిర్మాణాలు చేపట్టడంతో వరద నీరంతా కాలనీల్లోకి చేరింది. ఇందిరానగర్, కోర్టు పరిసర ప్రాంతాలతో పాటు కవిరాజ్ నగర్ ప్రధానంగా ముంపునకు గురయ్యాయి. ఆదివారం జిల్లా మొత్తం కలిపి సాయంత్రం 6 గంటల వరకు 269.8 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. అత్యధికంగా బోనకల్ మండలంలో 43.8, చింతకానిలో 30.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఖమ్మం జిల్లాలో వరద బాధితుల కోసం మొత్తం 39 పునరావాస సహాయ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇందులో 7,090 మంది ఆశ్రయం పొందుతున్నారు. వారికి ఉదయం టిఫిన్ తో పాటు భోజనం, ఇతర సౌకర్యాలను కల్పించినట్టు అధికారులు చెబుతున్నారు.





# విజయవాడ-హైదరాబాద్ మధ్య రవాణా బంద్

## 560కి పైగా బస్సులను రద్దు చేసిన ఆర్టీసీ

## 86 రైళ్లను రద్దు చేసినట్లు దక్షిణ మధ్య రైల్వే వెల్లడి

**విజయవాడ,సెప్టెంబర్2 (ప్రజా మంటలు):** రెండు రోజులుగా కురుస్తున్న కుండపోత వర్షాల కారణంగా తెలుగు రాష్ట్రాలను భారీగా వరదలను ముంచెత్తడంతో టీజీఎస్‌ఆర్టీసీ కీలక నిర్ణయం తీసుకుంది. ఏపీ, తెలంగాణ మధ్య రవాణాకు కీలకమైన హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై పలు చోట్ల భారీగా వరద ప్రవహిస్తుండటంతో ఆ మార్గంలో వెళ్లే బస్సులను రద్దు చేసింది. హైదరాబాద్-విజయవాడ మధ్య 560కి పైగా బస్సులను రద్దు చేస్తూ టీజీఎస్‌ఆర్టీసీ నిర్ణయం తీసుకుంది. ఖమ్మం జిల్లాలో 160, వరంగల్ జిల్లాలో 150, రంగారెడ్డి జిల్లాలో 70కిపైగా బస్సులను టీజీఎస్‌ఆర్టీసీ రద్దు చేసింది.కాగా, తెలుగు రాష్ట్రాల్లో భారీ వర్షాలు, వరదల నేపథ్యంలో 86 రైళ్లను రద్దు చేసినట్లుగా దక్షిణ మధ్య రైల్వే వెల్లడించింది. వీటితో పాటు 70కి పైగా రైళ్లను దారి మళ్లించినట్లు తెలిపింది. రద్దయిన రైళ్లలో సూపర్‌ఫాస్ట్, ఎక్స్‌ప్రెస్‌లు ఉన్నాయని ఎస్‌సీఆర్ వెల్లడించింది. పలు ప్యాసింజర్ రైళ్లను కూడా రద్దుచేసినట్లు తెలిపింది. మరికొన్నింటిని పాక్షికంగా రద్దుచేశామని అధికారులు పేర్కొన్నారు. కాజీపేట-డోర్నకల్-కాజీపేట, డోర్నకల్-విజయవాడ- డోర్నకల్, విజయవాడ-గుంటూరు-విజయవాడ రైళ్లను రద్దు చేయగా, ఢిల్లీ-సెంట్రల్ చెన్నై, దానాపూర్-బెంగళూరు రైళ్లను దారి మళ్లించారు. అదేవిధంగా రాయపురం-పటేల్ నగర్, హజ్రత్ నిజాముద్దీన్-రేణిగుంట రైళ్లను మరోమార్గంలో మళ్లించారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లను భారీ వర్షాలు ముంచెత్తాయి. దీంతో ఎక్కడ చూసిన వాగులు, వంకలు పోటెత్తాయి. వర్షాలు, వరదల కారణంగా దక్షిణ మధ్య రైల్వే 86 రైళ్లను రద్దు చేసింది. మరో 70కి పైగా రైళ్లను దారి మళ్లించింది. రద్దయిన రైళ్లలో సూపర్‌ఫాస్ట్, ఎక్స్‌ప్రెస్‌లు ఉన్నాయని ఎస్‌సీఆర్ వెల్లడించింది. పలు ప్యాసింజర్ రైళ్లను కూడా రద్దుచేసినట్లు తెలిపింది. మరికొన్నింటిని పాక్షికంగా రద్దుచేశామని అధికారులు పేర్కొన్నారు.





# బిజెపి సభ్యత్వ నమోదు ప్రారంభించిన ప్రధాని

## పార్టీ ప్రధాన కార్యాలయంలో లాంఛనంగా ప్రారంభం

న్యూఢిల్లీ,(ప్రజా మంటలు):

భారతీయ జనతా పార్టీ జాతీయ సభ్యత్వ నమోదు కార్యక్రమం 'సంఘటన్ పర్వ, సదస్యత అభియాన్ 2024'ను ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సోమవారంనాడు ప్రారంభించారు. ఢిల్లీలోని బీజేపీ ప్రధాన కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, హోం మంత్రి అమిత్‌షా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, ఇతర అగ్రనేతలు పాల్గొన్నారు. బీజేపీ ప్రపంచంలోనే అతిపెద్ద పార్టీ మాత్రమే కాకుండా అత్యంత ప్రజాస్వామిక పార్టీ అని ఈ సందర్భంగా అమిత్‌షా పేర్కొన్నారు. ఏ పార్టీ కూడా బీజేపీలా ఇంత పారదర్శకంగా, నిజాయితీతో సభ్యత్వ నమోదు చేసింది లేదన్నారు. జాతీయ సభ్యత్వ నమోదు కార్యక్రమానికి హాజరైన పార్టీ కార్యకర్తలను జేపీ నడ్డా స్వాగతించారు. దేశ ప్రధాన సేవకుడిగా మోదీ బీజీ షెడ్యూల్‌లో కూడా ఇక్కడకు విచ్చేశారని అన్నారు. ఆయన మనందరికీ స్ఫూర్తి, రోల్ మోడల్ అని ప్రశంసించారు. సంఘటన్ పర్వ్ ఎప్పుడు జరిగినా, ఎన్నడు అవసరమున్నా తన బిజీ సమయంలో కూడా ఆయన కొంత సమయం వెచ్చిస్తుంటారని చెప్పారు. అమిత్‌షా పార్టీ జాతీయ అధ్యక్షుడుగా ఉన్నప్పుడు కూడా సభ్యత్వ నమోదు ప్రచారానికి ప్రాధాన్యతనిచ్చే వారని గుర్తుచేశారు. సెప్టెంబర్ 2న సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభమవుతోందని, 88 00 00 2024కు మిస్డ్ ఫోన్ కాల్‌తో సభ్యులు కావచ్చని బీజేపీ ఒక ట్వీట్‌లో తెలిపింది. పార్టీ సీనియర్ నేత అమిత్‌షా సైతం సోమవారం ఉదయం ఒక ట్వీట్‌లో బీజేపీ కార్యకర్తలు, శ్రేయోభిలాషులకు ఈ రోజు ఎంతో కీలకమైన, శుభదినమని తెలిపారు. ప్రపంచంలోనే అతి పెద్ద, శక్తవంతమైన బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రధానమంత్రి మోదీ, జేపీ నడ్డా ప్రారంభిస్తున్నారని తెలిపారు. బీజేపీ శ్రేయోభిలాషులు, పార్టీ కార్యకర్తలు, దేశవాసులంతా తిరిగి సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొని పార్టీని సరికొత్త శిఖరాలకు (సభ్యత్వ నమోదును) తీసుకువెళ్లాలని కోరారు.

# పరిహారం సరిపోదు

**- మృతుల కుటుంబాలకు రూ.25 లక్షల పరిహారం చెల్లించాల్సిందే.. - కేటీఆర్ డిమాండ్**

హైదరాబాద్ (ప్రజా మంటలు):



రాష్ట్రంలో వరదల కారణంగా ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు కేవలం రూ. 5 లక్షలు నష్టపరిహారం ప్రకటించడం అన్యాయం అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. వరదల్లో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు రూ. 25 లక్షలు నష్టపరిహారం ప్రకటించాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కేటీఆర్ డిమాండ్ చేశారు.గతంలో పీసీసీ అధ్యక్షుడి హోదాలో రేవంత్ రెడ్డినే వరదల్లో ప్రాణాలు కోల్పోయిన కుటుంబాలకు రూ. 25 లక్షలు పరిహారం అందిస్తామని చెప్పారు. ఇప్పుడు అధికారంలో ఉన్నారు. మీరు ఇచ్చిన మాటను నిలబెట్టుకొని రూ. 25 లక్షలు పరిహారం ప్రకటించండి. వరదల్లో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉండాల్సిన అవసరం ఉంది. వరదల్లో చనిపోయిన వారి కుటుంబాలకు కూడా ఇచ్చిన మాటను నిలబెట్టుకోకపోతే అంతకన్నా మోసం మరొకటి ఉండదు, ముఖ్యమంత్రి గారు అని కేటీఆర్ పేర్కొన్నారు.అదే విధంగా, వరదల కారణంగా ఇళ్లు కోల్పోయిన, డ్యామేజ్ అయిన వారికి రూ. 2.5 లక్షల నుంచి రూ. 5 లక్షల వరకు సాయం చేస్తామని చెప్పారు. ఆ హామీని కూడా నెరవేర్చండి. ప్రభుత్వం అసమర్థత, చేతగానితనం, ముందస్తు ప్రణాళిక లేకపోవడం కారణంగానే ప్రాణనష్టం జరిగింది. ఇకనైనా ప్రజల ప్రాణాలు రక్షించేందుకు చర్యలు చేపట్టి వరద ప్రభావిత ప్రాంతాల ప్రజలకు భరోసా కల్పించండి అని కేటీఆర్ సూచించారు.

# హసీనాను అప్పగిస్తారా.. లేదా?

**- భారత్ వైఖరిపై బంగ్లా అసహనం**

ఢాకా (ప్రజా మంటలు):




బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనాను భారత్ తమ దేశానికి అప్పగిస్తుందా, లేదా అని అక్కడి తాత్కాలిక ప్రభుత్వం ప్రశ్నించింది. అంతర్జాతీయ మీడియా వర్గాలు తెలిపిన వివరాల ప్రకారం విదేశీ వ్యవహారాల సలహాదారు ఎండీ తౌహిద్ హుస్సేన్ మీడియాతో మాట్లాడుతూ హసీనాను బంగ్లాకు రప్పించడానికి యూనస్ ప్రభుత్వం ఏమైనా చేస్తుందని పేర్కొన్నారు. ఆమెను బంగ్లాకు అప్పగించాలని భారత్‌ను ఎన్నిసార్లు అడిగినా జవాబు లేదని అసహనం వ్యక్తంచేశారు. హసీనాను అప్పగించాలా, వద్దా అనే విషయంపై నిర్ణయం తీసుకోవాల్సిన బాధ్యత భారత్‌పైనే ఉందని వ్యాఖ్యానించారు. మా న్యాయవ్యవస్థ తలుచుకుంటే ఆమెను ఎలాగైనా తిరిగి తీసుకురావడానికి ప్రయత్నిస్తాము. మనకు భారత్‌తో వివిధ ఒప్పందాలు, చట్టపరమైన పక్రియలు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. హసీనా భారత్‌లో ఎక్కడ తలదాచుకున్నారనే విషయం బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వానికి తెలుసా అని మీడియా ప్రశ్నించడంతో 'ఆ విషయం భారత్‌ను అడగండి' అంటూ ఆగ్రహం వ్యక్తంచేశారు. హసీనా ప్రభుత్వం చేపట్టిన రిజర్వేషన్లకు వ్యతిరేకంగా విద్యార్థులు పెద్దఎత్తున నిరసనలు చేపట్టడంతో ఆమె దేశం వదిలి పారిపోయి, భారత్‌లో ఆశ్రయం పొందుతున్నారు. అయితే బంగ్లాదేశ్ హసీనా, ఆమె బంధువుల దౌత్య పాస్‌పోర్ట్‌లను రద్దు చేసింది. భారత్‌తో బంగ్లాదేశ్ ద్వైపాక్షిక సంబంధాల విషయంలో హసీనా అప్పగింత అంశం కీలక పాత్ర పోషిస్తుందని బీఎన్‌పీ (బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ) ఇప్పటికే తేల్చిచెప్పింది. ఈ విషయాన్ని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి మిర్జా ఫఖ్రుల్ ఇస్లాం ఆలంగీర్ ఓ ఇంటర్వ్యూలో వెల్లడించారు. ఆమెకు భారత్‌లోనే ఆశ్రయం కొనసాగితే భవిష్యత్తులో ఇరుదేశాల మధ్య సంబంధాలు దెబ్బతింటాయని పేర్కొన్నారు. న్యూఢిల్లీతో బలమైన సంబంధాలను బీఎన్‌పీ కోరుకుంటోందని ఆయన తెలిపారు.హసీనా హయాంలో రిజర్వేషన్లపై విద్యార్థులు చేపట్టిన ఆందోళనలు హింసాత్మకంగా మారడంతో వందల మంది ప్రాణాలు కోల్పోయారు. వారి కుటుంబసభ్యుల మరణాలకు హసీనానే కారణమని ఆరోపిస్తూ పలువురు ఫిర్యాదులు చేశారు. దీంతో బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనాపై కేసులు నమోదవుతూనే ఉన్నాయి. ఆమెతో పాటు మాజీ మంత్రులు, అనుచరులపై పోలీసులు 31 కేసులు నమోదు చేశారు. మొత్తంగా హసీనా ప్రస్తుతం 53 కేసులు ఎదుర్కొంటున్నారు. వీటిలో 44 హత్య కేసులు, మారణహోమానికి సంబంధించి ఏడు కేసులతో పాటు బీఎన్‌పీ పార్టీ ఊరేగింపు సమయంలో చోటుచేసుకున్న ఘర్షణలో ఆమెపై దాడి కేసు నమోదయ్యింది.

# మేడిగడ్డకు భారీగా వరద

జయశంకర్ భూపాలపల్లి (ప్రజా మంటలు):

జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం అంబట్‌పల్లి గ్రామంలో ఉన్న మేడిగడ్డ బరాజ్‌కు వరద భారీగా పెరుగుతున్నది. ఎగువన ఉన్న మహారాష్ట్రతో పాటు స్థానికంగా కురుస్తున్న వర్షాల కారణంతో ప్రాణహిత, గోదావరి నదులు పొంగుతుం డడంతో సోమవారం బరాజ్ వద్ద ఇన్‌ఎ÷-లో 6,79,900 క్యూసెక్కులకు చేరుకోగా మొత్తం 85 గేట్లు ఎత్తి అంతే మొత్తంలో నీటిని దిగువకు వదులుతున్నారు. అలాగే బరాజ్‌కు మానేరు, ఇతర చిన్న కాల్వల ద్వారా 6,42,237 క్యూసెక్కుల వరద వస్తుండగా, మొత్తం 66 గేట్లు ఎత్తి అంతే మొత్తంలో నీటిని దిగువకు వదులుతున్నారు. కాగా, కాళేశ్వరం వద్ద గోదావరి ఉధృతి భారీగా పెరిగింది. ఉదయం మూడు లక్షల క్యూసెక్కుల వరద ఉండగా, సాయంత్రానికి అది 7 లక్షలకు చేరుకుంది. గోదావరి గంట గంటకు పెరుగుతుండడంతో అధికారులు అక్కడే ఉంటూ గస్తీ కాస్తున్నారు.





# ముప్పు ఇంకా తొలగలేదు

**- మరిన్ని వర్షాలు కురిసే అవకాశం- ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిందే**

**- వాతావరణ శాఖాధికారులు సూచన**

హైదరాబాద్ (ప్రజా మంటలు):

తెలంగాణలో కూడా వర్షాలు బీభత్సం సృష్టించాయి. హైదరాబాద్ సహా అన్ని జిల్లాల్లో వానలు ఏకదాటిగా కురుస్తుండటంతో చాలా ప్రాంతాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. ఖమ్మం జిల్లా మరింతగా నష్టపోయింది. దీంతో అధికారులు ఖమ్మం జిల్లాపై ప్రత్యేక దృష్టి పెట్టారు.దాదాపు 9 జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. ఆ జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేసింది. ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, కామారెడ్డి, మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి నారాయణపేట, గద్వాల జిల్లాలకు అధికారులు రెడ్ అలర్ట్ ప్రకటించారు. 20 సెంటీమీటర్లకుపైగా వర్షపాత నమోదు అయ్యే అవకాశం ఉందని చెబుతున్నారు. కుమ్రం భీం, మంచిర్యాల, జగిత్యాల, జయశంకర్, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, వరంగల్, హనుమకొండ, జనగామ, వికారాబాద్, సంగారెడ్డి జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ ప్రకటించారు. రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, సిద్దిపేట, యాదాద్రి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్, మల్కాజిగిరి, మెదర్ జిల్లా ఎల్లో ఆలర్ట్ హెచ్చరికలు అధికారులు జారీ చేశారు. రెడ్ అలర్ట్ జారీ అయిన జిల్లాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖాధికారులు సూచిస్తున్నారు. అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని హెచ్చరిస్తున్నారు. ఇప్పటికే కురిసిన వానలకు పలు ప్రాంతాలు నీట మునిగాయని... ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాల వల్ల వరదలు మరింత పెరిగే ప్రమాదం ఉందని చెబుతున్నారు. అందుకే ప్రయాణాలు, ఇతర పనులు వాయిదా వేసుకోవాలని సూచిస్తున్నారు. తెలంగాణ వ్యాప్తంగా కురిసిన వర్షాలకు ఇప్పటి వరకు దాదాపు పదిమంది వరకు మృతి చెందారు. భారీగా కురిసిన వర్షాలకు జలాశయాలు నిండుకుండలను తలపిస్తున్నాయి. కొన్ని ప్రాంతాల్లో వాగులు వంకలు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. తెలంగాణలో భారీ నష్టం ఖమ్మం జిల్లాకు జరిగిందని అధికారులు అభిప్రాయ పడుతున్నారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా అధికారులను అప్రమత్తం చేస్తున్నారు. ఖమ్మం జిల్లాలో చాలా కాలనీలు ఇంకా నీటిలోనే ఉన్నాయి. పాలేరు వాగు ప్రవాహం ధాటికి కోదాడ సమీపంలోని రామాపురం వద్ద ఉన్న క్రాస్ రోడ్డ బ్రిడ్జి తెగిపోయింది. దీంతో ఏపీకి వెళ్లే వాహనాలన్నీ నిలిచిపోయాయి. ఇరు ప్రాంతాల మధ్య రాకపోకలపై తీవ్ర ప్రభావం పడింది. భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. అటు వర్షాల ధాటికి సింగరేణిలో బొగ్గు ఉత్పత్తి కూడా ఆగిపోయింది. న్ని ప్రాంతాలకు వర్షాలు భారీగా కురిసే ప్రమాదం ఉందని గ్రహించిన అధికారులు తెలుగు రాష్టాల్లోని అన్ని జిల్లాల్లో పాఠశాలలకు సెలవులు ప్రకటించారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు జనగామ జిల్లా దేవరుప్పుల మండలం కడవెండి వాగు ఉధృతంగా ప్రవహిస్తూ ఉంది. దీంతో వాగులో గొర్రెల కాపరులు కొట్టుకుపోయారు. వాగు ఉధృతి ఒక్కసారిగా పెరగడంతో చంద్రయ్య, అంకుష్ జారిపడిపోయారు. వాళ్లిద్దరిని స్థానికులు అతి కష్టమ్మీద కాపాడారు. వాళ్లను కాపాడినప్పటికీ 80 గొర్రెలు మాత్రం వాగులో చిక్కుకున్నాయి.

# నిందితుడైనంతా మాత్రాన .. ఇంటిని కూల్చేస్తారా?

**- ఒకవేళ ఆ వ్యక్తి దోషిగా తేలినా సరే బుల్డోజర్ చర్యలు సరికాదు**

**- సుప్రీంకోర్టు ఆగ్రహం**

దిల్లీ (ప్రజా మంటలు):



ఈ మధ్య నేరారోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తుల ఇళ్లపైకి బుల్డోజర్లను పంపిస్తున్న ఘటనలు తరచూ చోటుచేసుకుంటున్నాయి. అక్రమ కట్టడాల అభియోగాల కింద వాటిని అధికారులు కూల్చేస్తున్నారు.దీంతో ఈ అంశం వివాదాస్పదంగా మారుతోంది. ఇలాంటి 'బుల్డోజర్ న్యాయాన్ని' అడ్డుకోవాలంటూ సుప్రీంకోర్టు లో పలు పిటిషన్లు దాఖలయ్యాయి. వీటిపై సోమవారం విచారణ జరిపిన అత్యున్నత న్యాయస్థానం ప్రభుత్వాల తీరుపై అసహనం వ్యక్తం చేసింది. నిందితుల ఇళ్లను ఎలా కూల్చివేస్తారంటూ ప్రశ్నించింది. "ఒక వ్యక్తి ఏదైనా కేసులో నిందితుడిగా ఉన్నంత మాత్రాన ఆ కారణంతో కూల్చివేతలను ఎలా చేపడతారు? ఒకవేళ ఆ వ్యక్తి దోషిగా తేలినా సరే.. చట్టం సూచించిన విధానాన్ని అనుసరించకుండా అతడి ఆస్తిని కూల్చివేయకూడదు" అని జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌లతో కూడిన ధర్మాసనం వ్యాఖ్యా నించింది. దీనికి సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా బదులిస్తూ.. "కేవలం నిందితుడిగా ఉన్నాడని ఏ వ్యక్తి స్థిరాస్తిని కూల్చివేయట్లేదు. అది అక్రమకట్టడం అయితేనే చర్యలు తీసు కుంటున్నాం" అని కోర్టుకు విన్నవించారు.దీనిపై స్పందించిన ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. "ప్రజా రవాణా, రహదారులకు అడ్డంకిగా మారే అక్రమ కట్టడాలను మేం రక్షించడం లేదు. అయితే, ఈ కూల్చివేత లకు సంబంధించి పాన్-ఇండియా బేసిస్‌లో మార్గ దర్శ కాలను రూపొందించాల్సి ఉంది. దీనిపై ఇరు పక్షాలు తమ సూచనలు తెలియ జేయొచ్చు. త్వరలోనే దీనిపై నిర్ణయం తీసుకుంటాం" అని న్యాయస్థానం స్పష్టం చేసింది. అనంతరం దీనిపై తదుపరి విచారణను సెప్టెంబరు 17వ తేదీకి వాయిదా వేసింది.

## కంగనకు మధ్యప్రదేశ్ హైకోర్టు నోటీసులు

భోపాల్ (ప్రజా మంటలు):

బాలీవుడ్ నటి కంగనా రనౌత్‌కు మధ్యప్రదేశ్ హైకోర్టు నోటీసులు జారీ చేసింది. 'ఎమర్జెన్సీ' సినిమా విషయంలో దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యం పై న్యాయస్థానం నోటీసులు పంపించింది.ఈ నటితోపాటు కేంద్ర ప్రభుత్వం, మధ్యప్రదేశ్ ప్రభుత్వం, సెన్సార్ బోర్డు, మణికర్ణిక ఫిల్మ్స్, జీ స్టూడియోస్ సంస్థలు, జీ స్టూడియోస్ చీఫ్ బిజినెస్ ఆఫీసర్ ఉమేశ్ కె బన్సాల్, యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ (ఇండియా)లకు నోటీసులు జారీ చేసింది.'ఎమర్జెన్సీ' చిత్రంలోని కొన్ని సన్నివేశాలు ఒక వర్గం ప్రాథమిక హక్కులను ఉల్లంఘించేలా ఉన్నాయని, అందులో ప్రధాన పాత్ర పోషించిన కంగన క్షమాపణ చెప్పాలంటూ ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. దీన్ని విచారించిన చీఫ్ జస్టిస్ సంజీవ్ సచ్‌దేవ, జస్టిస్ వినయ్ సరఫ్‌లతో కూడిన ధర్మాసనం.. 24 గంటల్లోపు స్పందించాలని వారికి నోటీసులు జారీ చేస్తూ తదుపరి విచారణను మంగళవారానికి వాయిదా వేసింది.భారత తొలి మహిళా ప్రధాని ఇందిరా గాంధీ రాజకీయ జీవితం ఆధారంగా రూపొందిన చిత్రమిది. ఇప్పటికే పలుమార్లు వాయిదా పడుతూ వచ్చిన ఈ సినిమా సెప్టెంబరు 6న విడుదలకు సిద్ధమవగా.. మరోసారి వాయిదా పడనున్నట్టు సమాచారం.సెన్సార్ బోర్డు వద్ద ఈ సినిమాకి అభ్యంతరం వ్యక్తమైందంటూ బాలీవుడ్ వర్గాలు పేర్కొన్నాయి. సున్నితమైన అంశాలు ఈ సినిమాలో చాలా ఉన్నాయని అందుకే వాయిదా పడే అవకాశాలున్నాయని ప్రభుత్వ వర్గాల తాజా సమాచారం.

# జీఎస్టీ తగ్గింపులో రాష్ట్రాల ఆర్థిక మంత్రుల పాత్ర కీలకం

**- ఫ్లెక్స్ ఫ్యూయల్ వాహనాలపై జీఎస్టీ తగ్గించాలి**

**- 12 శాతానికి పరిమితం చెయ్యండి - కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ**

దిల్లీ (ప్రజా మంటలు):



ఫ్లెక్స్ ఫ్యూయల్ వాహనాలపై జీఎస్టీ తగ్గించాల్సిన అవసరం ఉందని కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ సూచించారు. ఈ తరహా వాహనాలపై జీఎస్టీని 12 శాతానికి పరిమితం చేయాలన్నారు. జీఎస్టీ తగ్గించడంలో రాష్ట్రాల ఆర్థిక మంత్రుల పాత్ర కీలకమని వ్యాఖ్యానించారు. బయో ఎనర్జీ అండ్ టెక్ ఎక్స్‌పోలో ఆయన మాట్లాడారు. శిలాజ ఇంధనాల వినియోగం తగ్గించి.. బయో ఫ్యూయల్ వాడకాన్ని ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. ఒకటి కంటే ఎక్కువ ఇంధన రకాలతో నడిస్తే వాటిని ఫ్లెక్స్ ఫ్యూయల్ వాహనాలు అంటారు. సాధారణంగా పెట్రోల్+ ఇథనాల్, మిథనాల్‌తో వంటి ఇంధనాలతో వీటిని నడపొచ్చు. అయితే, ఈ తరహా వాహనాలపై జీఎస్టీ తగ్గించాలంటే రాష్ట్రాల ఆర్థిక మంత్రుల సాయం ముఖ్యమన్నారు. ఇదే విషయమై గతంలో యూపీ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌ను కోరినట్లు చెప్పారు. ఇటీవల మహారాష్ట్ర ఆర్థిక మంత్రి అజిత్ పవార్‌తోనూ ఇదే విషయమై మాట్లాడానని చెప్పారు. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ నేతృత్వంలో నిర్వహించే జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో ఈ అంశం గురించి లేవనెత్తాలని సూచించినట్లు చెప్పారు.ఏటా మన దేశం రూ.22 లక్షల కోట్ల విలువైన శిలాజ ఇంధనాన్ని దిగుమతి చేసుకుంటోందని గడ్కరీ అన్నారు. ఈ ఇంధన వాడకం అనేది పర్యావరణంపైనే కాకుండా ప్రభుత్వ ఖజానాపైనా భారం పడుతోందన్నారు. అందుకే శిలాజ ఇంధనాల వాడకాన్ని తగ్గించి.. బయో ఫ్యూయల్‌ను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. దీనివల్ల అటు వ్యవసాయ రంగానికీ మేలు చేకూర్చినట్లవుతుందన్నారు.

## సెబీ చీఫ్‌పై కాంగ్రెస్ తీవ్ర ఆరోపణలు

దిల్లీ (ప్రజా మంటలు):

సెబీ చీఫ్ మాధబి పురీ బుచ్‌పై కాంగ్రెస్ తీవ్ర ఆరోపణలు చేసింది. సెబీ ఛైర్‌పర్సన్‌గా ఉంటూ.. ఆమె ఐసీఐసీఐ బ్యాంక్ నుంచి వేతనం తీసుకుంటున్నారంటూ ఆరోపించింది. ఈ మేరకు ఆ పార్టీ నేత పవన్ ఖేడా సోమవారం దిల్లీలో మీడియాతో మాట్లాడారు. ఇది పరస్పర విరుద్ధ ప్రయోజనాలకిందకే వస్తుందంటూ వ్యాఖ్యానించారు. ఇది ప్రజా సేవల్లో నైతికత, జవాబుదారీతనాన్ని ఉల్లంఘించడమే అవుతుందని పేర్కొన్నారు.ఒక కంపెనీలో పనిచేస్తూ ఒకచోట మాత్రమే వేతనం తీసుకోవాల్సి ఉంటుందని పవన్ అన్నారు. అలాంటిది సెబీ చీఫ్ విషయంలో అలా జరగడం లేదన్నారు. సెబీ పూర్తికాల సభ్యురాలిగా ఉన్న మాధబి ఐసీఐసీఐ బ్యాంక్, ప్రుడెన్షియల్ నుంచి వేతనం అందుకుంటున్నారని ఆరోపించారు. 2017-2024 మధ్య ఎంప్లాయీ స్టాక్ ఆప్షన్లు కూడా అందుకున్నారని పేర్కొన్నారు. ఒక అత్యున్నత నియంత్రణ సంస్థను నడిపిస్తున్న వ్యక్తులు ఇలా వేతనం అందుకోవడం సెబీ నిబంధనలకు విరుద్ధమని పేర్కొన్నారు.2017 నుంచి సెబీ సభ్యురాలిగా ఉన్న బుచ్.. 2022లో ఛైర్‌పర్సన్ అయ్యారని పవన్ వెల్లడించారు. గత ఏడేళ్ల కాలంలో ఆమె సుమారు రూ.16 కోట్లకు పైగా వేతనం అందుకున్నారని ఆరోపించారు. సెబీ చీఫ్‌గా ఉంటూ ఐసీఐసీఐ నుంచి వేతనం ఎందుకు తీసుకుంటున్నారని ప్రశ్నించారు. ఈ వ్యవహారంపై బయట వ్యక్తుల ప్రభావం పడకుండా పారదర్శకంగా విచారణ జరిపించాలని కోరారు. వేతనం అందుతుండడం వల్లే ఐసీఐసీఐ బ్యాంక్‌పై పలు విచారణలు నిలిచిపోయాయని ఆరోపించారు. సెబీ చీఫ్ నియామకంలో కీలకమైన కేబినెట్ అపాయింట్‌మెంట్ కమిటీలో కీలక వ్యక్తులైన ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షాను పవన్ ఖేడా తప్పుబట్టారు.

## ఆప్ నేత అరెస్టు

**- అమానతుల్లా ఖాన్‌ను అదుపులోకి తీసుకున్న ఈడీ**


దిల్లీ (ప్రజా మంటలు):

ఆప్ నేత, ఎమ్మెల్యే అమానతుల్లా ఖాన్‌ను మనీలాండరింగ్ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ సోమవారం అరెస్టు చేసింది. నేటి ఉదయం నుంచి ఆయన ఇంట్లో సోదాలు చేపట్టింది.దిల్లీ వక్ఫ్‌బోర్డ్‌లో నియామకాలు, ఆ సంస్థకు చెందిన రూ.100 కోట్లు విలువ చేసే ఆస్తుల లీజుకు సంబంధించిన అవకతవకల్లో అమానతుల్లా హస్తం ఉన్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.తన ఇంట్లో తనిఖీలు ప్రారంభమైన సమయంలో అమానతుల్లా ఖాన్ ఒక వీడియో స్టేట్‌మెంట్‌ను ఎక్స్‌లో విడుదల చేశారు. తనిఖీల పేరిట వచ్చి తనను అరెస్టు చేయడానికి ఈడీ ప్లాన్ చేస్తోందని దీనిలో ఆరోపించారు. క్యాన్సర్‌తో బాధపడుతున్న తన అత్తగారు ఇంట్లోనే ఉన్నారని పేర్కొన్నారు. ఈ విషయాన్ని ఈడీకి వెల్లడించినట్లు తెలిపారు. దాదాపు రెండేళ్లుగా తప్పుడు కేసులు బనాయించి ఆ దర్యాప్తు సంస్థ తనను వేధిస్తున్నట్లు చెప్పారు. కేవలం తానే కాదని.. తన పార్టీ మొత్తాన్ని ఈడీ వెంటాడుతోందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా అమనతుల్లా పోస్టు చేసిన వీడియోలో ఈడీ అధికారులతో మాట్లాడుతున్న దృశ్యాలు ఉన్నాయి.అమానతుల్లా ఖాన్ ఇంట్లో తనిఖీలపై ఆప్ కీలక నేత సంజయ్ సింగ్ స్పందించారు. దురుద్దేశాలతోనే ఈడీ ఆయనపై దర్యాప్తు చేపట్టిందని ఆరోపించారు. సుప్రీం కోర్టు పలుమార్లు మందలించినా ఈడీ ఈ చర్యలను ఆపడంలేదని పేర్కొన్నారు. కేవలం ప్రతిపక్షాలను జైల్లో పెట్టడమే వారి లక్ష్యంగా కనిపిస్తోందన్నారు.ఈ కుంభకోణంలో దాదాపు ఆరేళ్లుగా దర్యాప్తు చేసినా.. ఈడీ, సీబీఐలు ఏమీ తేల్చలేకపోయాయని సంజయ్‌సింగ్ పేర్కొన్నారు. అసలు ఇప్పటికే అమానతుల్లా న్యాయవాది ఈడీకి లేఖ రాసి సమయం కోరినా ఇవ్వలేదని ఆయన ఆరోపించారు. ఈ విషయంలో కోర్టు ఎదుట తమకు న్యాయం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

# గవర్నర్ వ్యవస్థను రద్దు చేయాల్సిందే

**రాజ్యసభ సభ్యుడు సింఘ్వి డిమాండ్**

దిల్లీ (ప్రజా మంటలు):



పలు రాష్ట్రాల్లో అధికార ప్రభుత్వం, గవర్నర్ మధ్య విభేదాలు కొనసాగుతున్న క్రమంలో కాంగ్రెస్ సీనియర్ నేత అభిషేక్ మను సింఘ్వి కీలక వ్యాఖ్యలు చేశారు. గవర్నర్ పదవిని పూర్తిగా రద్దు చేయాలని అన్నారు. అలా కానీ పక్షంలో ఎటువంటి రాజకీయలకు సంబంధం లేని ఉన్నతస్థాయి వ్యక్తులను మాత్రమే ఏకాభిప్రాయంతో నియమించాలని డిమాండ్ చేశారు. తాజాగా ఆయన ఓ వార్తాసంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడారు.ఈ ప్రభుత్వం అతిపెద్ద వైఫల్యం ఏమిటంటే.. ప్రతీ సంస్థను కించపర్చటం, దాని విలువ తగ్గించటం. కొన్ని రాష్ట్రాల్లో గవర్నర్లు రెండో చీఫ్ ఎగ్జిక్యూటివ్‌గా వ్యవహరించిన సందర్భాలు చాలా ఉన్నాయి. అందుకే గవర్నర్ పదవిని పూర్తిగా రద్దు చేయాలి. లేదంటే రాజకీయలకు సంబంధంలేని వ్యక్తిని మాత్రమే నియమించాలి. ఒకవేళ రాష్ట్ర ముఖ్యమంత్రికి, గవర్నర్‌కు మధ్య విభేదాలు తలెత్తితే వెంటనే గవర్నర్‌ను తెలగించాలి. ఎందుకంటే ఎన్నికల ప్రకియలో ప్రజలు ముఖ్యమంత్రిని ఎన్నుకుంటారు కానీ గవర్నర్ కాదు. ప్రస్తుతం గవర్నర్ల తీరు వల్ల పరిపాలన కష్టంగా మారుతోంది. ప్రభుత్వం చేసని కొన్ని ముఖ్యమైన బిల్లులను గవర్నర్లు ఆమోదించకుండా జాప్యం చేస్తున్నారని అన్నారు. తమిళనాడు, పశ్చిమ బెంగాల్, కర్ణాటక రాష్టాల్లో ప్రభుత్వానికి, గవర్నర్ మధ్య వివాదాలు చెలరేగుతున్న నేపథ్యంలో అభిషేక్ మను సింఘ్వీ చేసిన వ్యాఖ్యలు చర్చనీయంశంగా మారాయి. మరోవైపు.. సింఘ్వీ ఇటీవల తెలంగాణ రాజ్యసభ ఎన్నికల్లో ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

# ప్రకృతి విలయంపై కళ్లు తెరవాలి!

ఐదారేళ్ల కోసారి ప్రకృతి విలయం సృష్టిస్తోంది. చార్‌ధామ్ తరవాత వయనాడ్..ఇప్పుడు తెలుగు రాష్ట్రాల్లో విలయం చూస్తుంటే...మనలో కించిత్ మార్పు కూడా కానరావడం లేదు. ప్రకృతి విధ్వంసంపై ఎవరూ మాట్లాడడం లేదు. ప్రజలు కూడా ఎందుకు ఇలా జరుగుతుందో అన్న బాధలేదు. ప్రకృతిని మరమంతా విధ్వంసం చేస్తున్నాం. చెరవులను వదలకుండా వెంటచర్లు వేశారు. నదీతీర ప్రాంతాలను ధ్వంసం చేశారు. అలాగే చెట్టూచేమలను ధ్వంసం చేశాం. కొండలు గుట్టలు ధ్వంసం చేశాం. ఇవన్నీ మనం చేశామా అని చాలామంది ఆశ్చర్య పోవచ్చు. కానీ పచ్చి నిజమని ప్రకృతి మనలను పదేపదే హెచ్చరిస్తోంది. తన ప్రతాపం చూపుతోంది. అయినా మానం మారడం లేదు. తెలంగాణలో హైడ్రాతో ఇటీవల సిఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం చెరువులను ఆక్రమించిన వారి భరతం పడుతోంది. దీనిపైనా అక్కసు వెళ్లగక్కుతున్నారు. చెరువులను అక్రమించిన పేదలు మల్లారెడ్డి, పల్లా రాజేశ్వర రెడ్డి, అక్బరుద్దీన్, కెటిఆర్ లాంటి వారి జోలికి వెళ్లవద్దని కోరుతున్నారు. ధనవంతులైన ప్రజలు మాత్రం చట్ట ప్రకారం ఇళ్లు కొనుగోళ్లు చేస్తూ ప్రభుత్వానికి పైసా కూడా తక్కువ కాకుండా పన్నుల కడుతున్నారు. ఈ క్రమంలో మనమంతా చెరువుల పునరుద్దరణకు పూనుకోవాలి. ప్రకృతి విలయానికి కారణమవుతున్న ఇసుక దోపిడీని అరికట్టాలి. కొండలు గుట్టలు ధ్వంసం చేయడం ఆపాలి. చెట్లను, అడవులను నరకుండా చూడాలి. ఇదంతా కూడా ప్రజలే చేయాలి. వారే స్వయంగా రంగంలోకి దిగాలి. తమ వనరులను పేదలైన నాయకులు దోచుకోకుండా చూసుకోవాలి. లేకుంటే ప్రస్తుతం వయనాడ్, ఇప్పుడు తెలుగు రాష్ట్రాల్లో జరుగుతన్న ప్రకృతి విలయం మరింత తీవ్రంగా ఉంటుంది. ఇప్పటికే తెలుగు రాష్ట్రాలు వణికి పోతున్నాయి. కనివినీ ఎరుగని రీతిలో గత రెండు రోజులుగా వర్షాలు భయాందోళనకు గురి చేస్తున్నాయి. రెండు తెలుగు రాష్ట్రాలు వర్షాలకు అతలాకుతలం అవవుతున్నాయి. జనజీవనం స్తంభించింది. కాలనీలకు కాలనీలే వరద నీటిలో చిక్కుకుపోతున్నాయి. తెలంగాణలోని ఖమ్మం జిల్లా, నిజామాబాద్ తదితర జిల్లాల్లో పరిస్థితి అధ్వాన్నంగా ఉంది. నదులు, ఏరులు, వాగులన్నీ పొంగి పొర్లుతున్నాయి. దీంతో ఏ క్షణం ఏం జరుగుతుందో తెలియక జనం బిక్కు బిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు. అత్యవసరమైతే తప్ప ఇళ్ల నుంచి బయటకు రావడం లేదు. కొన్ని ప్రాంతాల వాసులు పూర్తిగా పునరావాస కేంద్రాలకు చేరారు. సమయానికి ఆహారం, నీరు, నిద్ర అన్నీ కరువై అలమటిస్తున్నారు. ఊళ్లన్నీ చెరువులుగా మారాయి. చెరువులు తెగిపోయాయి. ఈ క్రమంలో తెలుగు రాష్ట్రాల్లో జలవిలయం ప్రకంపనలు సృష్టిస్తోంది. వరద నీటి ఉధృతితో పలు పట్టణాల్లోని కాలనీల్లోని పలు ఇళ్లు నీట మునిగాయి. ప్రజలు ఆకలి కేకలతో అల్లాడుతున్నారు. పలు ప్రాంతాలకు రాకపోకలు స్తంభించాయి. రైళ్లు రద్దు కావడంతోపాటు ఆర్టీసీ బస్సులను కూడా నిలిపివేశారు. ఇరు తెలుగు రాష్ట్రాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు పలుచోట్ల వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. విజయవాడ జలదిగ్బంధంలో ఉండిపోయింది. ఖమ్మం జిల్లా బాగా దెబ్బతింది. ఇప్పటికే ప్రాజెక్టులన్నీ నిండిపోయాయి. ఖమ్మం జిల్లాలో వాగులో పడి ఓ తండ్రీ కూతురు కొట్టుకు పోయారు. మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తోంది. కేసముద్రం-ఇంటికన్నె మార్గంలోని రైల్వే ట్రాక్ పూర్తిగా ధ్వంసమైంది. కేసముద్రం రైల్వేస్టేషన్‌లో పలు రైళ్లను నిలిపివేశారు. ప్రయాణికులకు పోలీసులు అల్పాహారం, నీరు అందించారు. ఈ రైల్వే ట్రాక్ పూర్తిస్థాయిలో దెబ్బతింది. రైల్వే ట్రాక్ కింద ఉండే కంకర మొత్తం వరదకు కొట్టుకుపోయింది. దీంతో విజయవాడ-కాజీపేట మార్గంలో పలు రైళ్లు రాకపోకలు నిలిచిపోయాయి. అధికారులు 24 రైళ్లను నిలిపివేశారు. ప్రయాణికుల సౌకర్యార్థం దక్షిణ మధ్య రైల్వే హెల్ప్ లైన్‌ను ఏర్పాటు చేసింది. రైల్వే అధికారులు కేసముద్రం- ఇంటికన్నె మార్గంలోని రైల్వే ట్రాక్‌ను పునరుద్ధరిస్తున్నారు. రైల్వేకు సంబంధించిన ట్రాక్‌లు కొట్టుకుపోవడంతో రైళ్ల రాకపోకలు తీవ్ర అంతరాయం కలిగింది. కాజీపేట, రాయనపాడులో ట్రాక్‌లు తెగిపోవడం రైళ్లు నిలిపివేశారు. 80 రైళ్లు రద్దు, మరో 48 రైళ్లను దారి మళ్లించారు. హైదరాబాద్ -విజయవాడ రూట్‌లోనే అత్యధిక రైళ్లు రద్దయ్యాయి. పలు ప్రాంతాలకు వెళ్లే రైళ్లు ఆలస్యంగా నడుస్తున్నాయి. కుండపోత వర్షాలతో ఏపీ అతలాకుతలం అయింది. మరో 24 గంటల పాటు రాష్ట్రంలో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. నాలుగు జిల్లాలకు రెడ్ అలర్ట్, మూడు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ ప్రకటించింది. గుంటూరు, ఎన్టీఆర్, పల్నాడు, ప్రకాశం జిల్లాలకు రెడ్ అలెర్ట్ జారీ చేసింది. బాపట్ల, కృష్ణా, ఏలూరు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ ప్రకటించింది. తీరం వెంబడి 45 నుంచి 55 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని తెలిపింది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించింది. మరోవైపు, విజయవాడలోని సింగ్ నగర్ లో పరిస్థితి దారుణంగా ఉంది. వరద దాటే ప్రయత్నం చేసిన ఓ మహిళ నీటిని దాటుతూ గుండెపోటుతో మృతి చెందింది.

## భారీ వర్షాలతో తెలంగాణ ప్రాజెక్టులకు జలకళ

### - నిండుకుండల్లా పలు జలాశయాలు

హైదరాబాద్(జనంసాక్షి):బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాలకు తెలంగాణ వ్యాప్తంగా ప్రాజెక్టులకు వరదనీరు పోటెత్తుతోంది. ఎగువ నుంచి వస్తున్న భారీ వరదనీటితో ప్రాజెక్టులు నిండుకుండను తలపిస్తున్నాయి. దీంతో ప్రాజెక్టుల వద్ద జలకళ సంతరించుకుంది. పెద్దఎత్తున వరదనీరు పోటెత్తడంతో పలు ప్రాజెక్టుల గేట్లను ఎత్తి అధికారులు నీటిని దిగువకు వదులుతున్నారు. తెలంగాణలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కాళేశ్వరం త్రివేణీ సంగమం వద్ద గోదావరి, ప్రాణహిత నదులు పరవళ్ళు తొక్కుతున్నాయి. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవ్‌పూర్ మండలం కాళేశ్వరం త్రివేణి సంగమం వద్ద ఉభయ నదులు ఉగ్రరూపం దాల్చాయి. తెలంగాణతో పాటు అటు మహారాష్ట్ర, ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో రాష్ట్రంలోకి భారీగా వరద వచ్చి చేరుతుంది. గోదావరి, ప్రాణహిత నదులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. నదీ ప్రవాహం పుష్కరఘాట్ ల మెట్లను తాకుతూ వెళ్తోంది. త్రివేణీ సంగమం వద్ద నీటిమట్టం క్రమక్రమంగా పెరుగుతోంది. కాళేశ్వరం త్రివేణి సంగమం పుష్కర ఘాట్లను తాకుతూ 7.530 మీటర్ల మేర వరద ప్రవాహం కొనసాగుతుంది. అటు, కాళేశ్వరం ప్రాజెక్టు లక్ష్మీ మేడిగడ్డ బ్యారేజ్ కి 3,51,970 క్యూసెక్కుల వరద ప్రవాహం రాగ, అంతే స్థాయిలో 85 గేట్ల ద్వారా అధికారులు దిగువకు నీటిని వదులుతున్నారు. నల్గొండ జిల్లాలోని నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు భారీ వరద ప్రవాహం కొనసాగుతోంది. పెద్దఎత్తున వరదనీరు చేరడంతో ప్రాజెక్టు 26గేట్లు ఎత్తి అధికారులు దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు ఇన్‌ఫ్లో, ఔట్ ఇన్‌ఫ్లో 5,42, 279క్యూసెక్కులుగా ఉంది. పూర్తిస్థాయి నీటిమట్టం 590అడుగులు కాగా.. ప్రస్తుతం 587.20అడుగులకు చేరుకుంది. ప్రాజెక్టు నీటి సామర్థ్యం 312టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 305.62టీఎంసీలు చేరింది. నల్గొండ జిల్లాలోని మూసీ ప్రాజెక్టుకు వరద ప్రవాహం కొనసాగుతోంది. ఇన్‌ఫ్లో 15,783క్యూసెక్కులు కాగా.. ప్రాజెక్టు నాలుగు గేట్లు 4అడుగుల మేర ఎత్తి 10,025క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం 4.46టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 3.805టీఎంసీలకు చేరింది. అలాగే ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 645అడుగులు కాగా.. ప్రస్తుతం 642.45అడుగులకు చేరుకుంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం వద్ద గోదావరి నది 27.3 అడుగుల మేర ప్రవహిస్తోంది. తాలిపేరు ప్రాజెక్ట్ 25గేట్లు ఎత్తి 33,175క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు ఇన్ ఫ్లో 31,537క్యూసెక్కులుగా ఉంది.నిర్మల్ జిల్లాలోని స్వర్ణ ప్రాజెక్టుకు 9,000క్యూసెక్కుల వరదనీరు వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు 2గేట్లు ఎత్తి 10వేల క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1,183అడుగులు కాగా ప్రస్తుతం 1,183అడుగులకు చేరుకుంది. మహబూబ్‌నగర్ జిల్లాలోని జూరాల ప్రాజెక్టుకు వరదనీరు భారీగా చేరుతోంది. ఇన్ ఫ్లో 3.75లక్షల క్యూసెక్కులు కాగా.. ప్రాజెక్టు 45గేట్లు ఎత్తి 4.10లక్షల క్యూసెక్కులు దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు నీటి సామర్థ్యం 9.657టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 7.952టీఎంసీలకు చేరుకుంది. అలాగే పూర్తిస్థాయి నీటిమట్టం 318.516మీటర్లు కాగా.. ప్రస్తుతం నీటిమట్టం 317.660మీటర్లకు చేరుకుంది. మహబూబ్‌నగర్ జిల్లాలోని మరో ప్రాజెక్టు కోయిల్ సాగర్. ఈ ప్రాజెక్టుకు వరద ప్రవాహం కొనసాగుతోంది. 18వేల క్యూసెక్కులు కాగా.. 5గేట్లు ఎత్తి 10,500క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. పూర్తిస్థాయి నీటి సామర్థ్యం 2.270టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 1.008టీఎంసీలకు చేరుకుంది. మంచిర్యాల జిల్లాలోని శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టుకు భారీగా వరదనీరు వస్తోంది. ఇన్ ఫ్లో 5.8లక్షల క్యూసెక్కులు కాగా.. ప్రాజెక్టు 30గేట్లు ఎత్తి 5లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 20.175టీఎంసీలు ఉండగా.. ప్రస్తుతం 18.8139టీఎంసీలకు చేరుకుంది. దీంతో దిగువ ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారుల హెచ్చరికలు జారీ చేశారు. నిర్మల్ జిల్లాలోని కడెం ప్రాజెక్టుకు భారీగా వరదనీరు చేరుతోంది. ప్రాజెక్టు ఇన్‌ఎ÷-లో 1.31లక్షల క్యూసెక్కులు ఉండగా.. 18గేట్లు ఎత్తి 2.19లక్షల క్యూసెక్కులు దిగువకు విడిచిపెడుతున్నారు. పూర్తి సామర్థ్యం 700అడుగులు కాగా.. ప్రస్తుతం 692.900అడుగులకు చేరుకుంది. కొమురం భీం ప్రాజెక్టుకు ఇన్ ఫ్లో 34,500క్యూసెక్కులుగా ఉండగా.. 5గేట్లు ఎత్తి 43,800క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 243మీటర్లు కాగా.. ప్రస్తుతం 237.900మీటర్లకు నీరు చేరింది.

## ప్రతిరోజు 3.5 లక్షల లడ్డూల విక్రయం

**శ్రీవారి భక్తులకు ఎక్కడా ఇబ్బంది కలడం లేదు: ఇవో**

తిరుమల,సెప్టెంబర్2 (ప్రజామంటలు):

తిరుమల శ్రీవారిని దర్శించుకున్న ప్రతి భక్తుడికి తగినన్ని లడ్డూలు అందిస్తామని టీటీడీ ఈవో జె. శ్యామలరావు చెప్పారు. టీటీడీ ప్రతిరోజు 3.5 లక్షల లడ్డూలను భక్తులకు విక్రయిస్తున్నదని, ఇందులో 2.5 లక్షల లడ్డూలు మాత్రమే భక్తులకు చేరుతున్నాయని, మిగిలిన లక్ష లడ్డూలు దర్శనం టోకెన్లు లేనివారు కొనుగోలు చేస్తున్నారని తెలియజేశారు. తిరుమల శ్రీవారి దర్శనానికి విచ్చేసే భక్తులకు ఒక ఉచిత లడ్డూతో పాటు, తగినన్ని రూ.50/- లడ్డూ ప్రసాదాలు అందించడమే టీటీడీ లక్ష్యం అన్నారు. స్వామివారిని దర్శించుకోకుండా లడ్డూల కొరకు నేరుగా లడ్డూ కౌంటర్లకు వెళ్ళే భక్తులకు ఆధార్ కార్డు ద్వారా రోజువారి రెండు లడ్డూలు ఇవ్వనున్నట్లు తెలిపారు.కొందరు దళారులు లడ్డూలను భారీ మొత్తంలో కొనుగోలు చేసి, బయట ప్రాంతాలలో అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు టీటీడీ విచారణలో తెలిసిందన్నారు. అదేవిధంగా బయట పట్టణ ప్రాంతాల్లో పెళ్లిళ్లు, ఇతర కార్యక్రమాల్లో శ్రీవారి లడ్డూ ప్రసాదాలు పంచుతున్నట్లు మా దృష్టికి వచ్చిందన్నారు. టీటీడీ అనుబంధ ఆలయాలు, సమాచార కేంద్రాలలో కూడా శ్రీవారి లడ్డూ ప్రసాదాలను టీటీడీ విక్రయిస్తోందన్నారు. తిరుమలతో పాటు ఇతర ప్రాంతాలలో ఉన్న శ్రీవారి భక్తులకు కూడా లడ్డూ ప్రసాదాలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామ న్నారు. తద్వారా భక్తులు దళారుల బారిన పడకుండా ఉండడానికి వీలవుతుందన్నారు.తిరుమల లడ్డూ కౌంటర్లలో విధులు నిర్వహించే కార్పొరేషన్ సిబ్బంది భారీ సంఖ్యలో లడ్డూలు విక్రయించినట్లు టీటీడీ విచారణలో గుర్తించామన్నారు. ప్రస్తుతం అమలు చేస్తున్న విధానం ద్వారా టీటీడీ ఐటి వ్యవస్థ సహకారంతో గత 3 రోజులుగా, భక్తుల ఆధార్ కార్డు నమోదుతో విక్రయిస్తున్న లడ్డూలు ఎవరికి ఇస్తున్నారు, దర్శనం చేసుకొని వారు ఎన్ని లడ్డూలు తీసుకొంటున్నారు, తదితర విషయాలు నమోదు చేస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికే సివిఎస్ఓ, జిల్లా ఎస్పీతో సంప్రదించి లడ్డూ దళారులను గుర్తించినట్లు తెలిపారు.కావున భక్తులు ఈ విషయాన్ని గమనించి, శ్రీవారి లడ్డు ప్రసాదాల విక్రయంపై వస్తున్న వదంతులను నమ్మవద్దని ఈవో విజ్ఞప్తి చేశారు.

## వ్యాసకర్తలకు వినతి


**రాజకీయ, ఆర్థిక, సామాజిక అంశాలపై వ్యాసాలు పంపేవారు మీ వ్యాసాలను వీలైనత క్లుప్తంగా, వివరణాత్మకంగా, 350-400 ల పదాలకు పరిమితం అయి ఉండేలా చూడండి. పెద్ద వ్యాసాలను పరిశీలించనడం సాధ్యం కాకపోవచ్చని గ్రహించగలరు. వర్డ్ డాక్యుమెంట్, లేదా ఓపెన్ ఫైల్ లో, ఈ మెయిల్ కు మాత్రమే పంపగలరు.**

mantalukathalu@gmail.com

-ఎడిటర్

## తెలంగాణ ప్రజల ఆత్మగౌరవానికి ఊపిరి పోసిన జమలాపురం కేశవరావు

### సెప్టెంబర్ 3...తెలంగాణ సర్దార్ జయంతి



రామ కిష్టయ్య సంగన భట్ల
9440595494



నిజాం నిరంకుశ పాలనలో బానిసలుగా బతుకుతున్న వారి స్వేచ్ఛకోసం, తమ జీవితాన్ని త్యజించిన వారిలో 'సర్దార్ జమలాపురం కేశవరావు' ముందు వరుసలో నిలుస్తారు. కట్టెదుట జరుగుతున్న అన్యాయాలకు చూస్తూ, సహిస్తూ ఉండలేక ప్రజల్లో ధైర్య సాహసాలను నూరి పోయడమే ఏకైక లక్ష్యంగా జీవితాంతం మందుకు సాగారు. హైదరాబాద్ రాజ్యంలో కాంగ్రెస్ పార్టీకి జీవంపోసి, ప్రజా శ్రేయస్సు కోసం సర్వస్వం త్యాగం చేసిన నిబద్ధత కలిగిన నేత, త్యాగశీలి సర్దార్ జమలాపురం కేశవరావు.

ఆయన్ను అందరూ తెలంగాణ 'సర్దార్'గా పిలుచు కుంటారు. తెలంగాణ కేసరిగా, 'దక్కన్ సర్దార్'గా బిరుదు లందుకున్న జమలాపురం కేశవరావు తనద్కెన శ్కెలిలో ఉద్యమాలు నడిపి కాంగ్రెస్‌కు, తెలుగు వారి ముఖ్యంగా తెలంగాణ ప్రజల ఆత్మగౌరవానికి ఊపిరి పోశారు. దక్కన్ సర్దార్‌గా, ఉక్కు మనిషిగా ప్రజలు పిలుచుకునే కేశవరావు నిజాం సంస్థానంలో తూర్పు భాగాన ఉన్న ఖమ్మం (నాటి వరంగల్ జిల్లా)లోని ఎర్రుపాలెంలో 1908, సెప్టెంబర్ 3 న జమలాపురం వెంకట రామారావు, వెంకట నరసమ్మలకు తొలి సంతానంగా జన్మించారు. సంపన్న జమీందారీ వంశంలో పుట్టినా, నాటి దేశ రాజకీయాలు అతనిని తీవ్రంగా కలవర పరచాయి.
వందేమాతరం గీతాలాపనను నిషేధించి నందుకు నిరసనగా, కళాశాల విద్యార్థులను కూడగట్టి, నిరసనోద్యమంలో కాలూనారు. గీతాన్ని ఆలాపించ నివ్వకపోతే తరగతులకు హాజరు కాబోమని హెచ్చరించారు. దీంతో చివరకు నిజాం పాలకవర్గం నిషేధాన్ని ఎత్తివేయక తప్పలేదు. ఈఘటన తర్వాత కేశవరావు ఆలోచనా పరిధి మరింత విస్తృతం అయింది. నిజాం పాలనలో కొనసాగుతున్న వెట్టి చాకిరితో అష్టకష్టాలకు గురవుతున్న ప్రజలను చూసిన కేశవరావు చలించి పోయారు. ప్రజలను విముక్తం చేయడానికి తెలంగాణ జిల్లాల్లో...ముఖ్యంగా వరంగల్, కరీంనగర్ జిల్లాల్లో కేశవరావు కాలినడకన విస్తృతంగా పర్యటించారు. ఆ క్రమంలోనే భారత స్వాతంత్ర్యోద్యమం పట్ల, గాంధీ సిద్ధాంతాల పట్ల కేశవరావు ఆకర్షితుడయ్యారు. 1923లో రాజమండ్రిలో మొదటిసారి మహాత్మా గాంధీ ఉపన్యాసాన్ని విన్న కేశవరావు, 1930లో విజయవాడలో జరిగిన సభలో గాంధీ పరిచయంతో మరింత ఉత్తేజితుడైనారు. ఆంధ్రపితామహుడుగా మాడపాటి హనుమంతరావు ప్రారంభించిన గ్రంథాలయ ఉద్యమంను తెలంగాణలోని ప్రతి పల్లెలోనూ ప్రచారం గావించారు. వయోజన విద్యకై రాత్రి పాఠశాలలు నడపడంలో కేశవరావు కృషి చేశారు. అణగారిన వర్గాల్లో చైతన్యాన్ని నింపడానికి ప్రత్యేక శ్రద్ధను కనపరిచేవారు.1938లో దీపావళి సందర్భంగా ఆవిర్భవించిన 'హైదరాబాద్ స్టేట్ కాంగ్రెస్' స్థాపనలో కేశవరావు కీలకపాత్ర వహించి, దానికి మొదటి అధ్యక్షుడయ్యారు. 1938 సెప్టెంబర్ 24 మధ్యాహ్నం మధిరలో గోవిందరావు నానక్, జనార్దనరావు దేశాయ్, రావి నారాయణరెడ్డిలతో కలిసి సత్యాగ్రహ దీక్షకు కేశవరావు సిద్ధమయ్యాడు. ఎట్టి పరిస్థితుల్లో సర్దార్‌ను దీక్ష చేయనివ్వొద్దని నిజాం ప్రభుత్వం అనుమతి నివ్వలేదు.
మధిరలో అడుగ డుగునా పోలీసులను మోహరించింది. అయినా భారీ సంఖ్యలో ప్రజలు దీక్ష వేదిక దగ్గరకు చేరుకున్నారు. అప్పుడే ఎవరూ ఊహించని విధంగా రైతు వేషంలో దీక్ష వేదిక దగ్గరకు వచ్చాడు కేశవరావు. వెంటనే మహాత్మా గాంధీకి జై, హైదరాబాద్ స్టేట్ కాంగ్రెస్ జై అని దిక్కులు పెక్కటిల్లేలా నినాదించారు. అరెస్టు చేసి నిషేధాన్ని ఉల్లఘించి సత్యగ్రహ దీక్ష చేశారంటూ కేశవరావుకు 18 నెలలు జైలు శిక్ష విధించారు. వరంగల్ జైలులో ఎనిమిది నెలల శిక్షను అనుభవించిన తర్వాత కేశవరావుతో సహా రాజకీయ ఖైదీలందరినీ నిజామాబాద్ జైలుకు తరలించారు. జైలు నుంచి విడుదలయ్యాక కూడా అదే పోరాట పంథాను కేశవరావు కొనసాగించారు. అంటరానితనం నిర్మూలించేందుకు, ఆదివాసీల అభివృద్ధికి కూడా ఉద్యమం చేశారు. 1942లో కాంగ్రెస్ పిలుపు మేరకు 'క్విట్ ఇండియా' ఉద్యమాన్ని తెలంగాణలో ఊరూరా ప్రచారం చేసే బాధ్యత వహించారు. 1946లో మెదక్ జిల్లా కందిలో కేశవరావు అధ్యక్షతన జరిగిన 13వ ఆంధ్ర మహాసభ సందర్భంగా నిర్వహించిన బ్రహ్మాండమైన ఊరేగింపు అందరినీ ఆకట్టుకుంది.
నిజాం సంస్థానం భారత దేశములో విలీనమైన తరువాత, 1952లో కేశవరావు రాజ్యసభకు ఎన్నికయ్యారు.

హైదరాబాద్‌పై "మనం ఏ ప్రభుత్వాన్ని అయినా సరే అది రాష్ట్ర, జాతీయ ప్రభుత్వం, కాంగ్రెసు ప్రభుత్వం అయినా, కాంగ్రెసు కాని ప్రభుత్వం అయినా అమాయక ప్రజలపై అత్యాచారాలు జరపడాన్ని సహించబోము. నంజప్ప మన ప్రభుత్వంలో ఒక అధికారి మాత్రమే. యింకా స్పష్టంగా చెప్పాలంటే ఆయన మన ప్రజలకు సేవకుడు. ఆయన యధేచ్ఛగా ప్రవర్తించడానికి, మేము అనుమతించడానికి సిద్ధముగా లేము. ఆయన చేస్తున్న అకృత్యాలు నిజాం తొత్తులైన జాగీర్దార్లను, నాజీ హిట్లరును తలదన్నిన నిజాంను మరిపిస్తున్నది. నంజప్ప తెలంగాణ రక్షకుడిగా కాక, భక్షకుడిగా వచ్చినట్లు అనిపిస్తున్నది." అని డోర్నకల్లులో జరిగిన సభలో కేశవరావు ఎలుగెత్తి చాటారు.

సర్దార్ కేశవరావు భాషారాష్ట్ర సిద్ధాంతానికి పూర్తిగా వ్యతిరేకి. తెలంగాణ అస్తిత్వాన్ని స్థిరీకరించాలని కోరుకున్నారు. కన్నడ, మరాఠీ భాషా ప్రాంతాలతో కలిసి పోయిన హైదరాబాద్ రాష్ట్రం అలాగే ఉండాలని వాంచించారు. అలాగే జమిందారి, జాగిర్దారీ వ్యవస్థలతో అతలాకుతలమైన తెలంగాణను విశాలాంధ్రలో కలిపినట్లయితే ఏమాత్రం మేలు జరగదని నొక్కి చెప్పారు. విద్యాపరంగా, సామాజిక, ఆర్థిక రంగాల్లో తెలంగాణను అభివృద్ధి చేయకుండా విశాలాంధ్ర ఏర్పాటు వల్ల స్థానికులపై స్థానికేతరుల అజమాయిషీ ఆరంభ మవుతుందని ముందుగానే ఊహించిన అనుభవశాలి ఆయన.

కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా ఉంటూ సభలు, సమావేశాలు జరిగినపుడు ఒక సామాన్య కార్యకర్త మాదిరిగా పందిళ్ళు వేయడానికి, కర్రలు కూడా నాటి నిరాడంబరతకు, పార్టీ పట్ల అంకితభావంకు నిలువెత్తు నిదర్శనంగా నిలిచి, అంతలా పార్టీకి సేవ చేసిన ఆయనకు కాంగ్రెస్ అంతర్గత రాజకీయాల మూలంగా రావాల్సినంత పేరు, దొరకాల్సిన గౌరవం రాలేదు. చేపట్టిన ప్రతి ఉద్యమం లోనూ విజయాల్ని సాధించిన ఆయన స్వాతంత్ర్యానంతర కాలంలో కాంగ్రెస్ పార్టీ నేతలు ఆయనకు ద్రోహం చేశారు. ఆయన ఎదుగుదలను అడ్డుకున్నారు. ఎన్నికల్లో ఓటమి చెందేలా పరిస్థితులు కల్పించారు.

జైలు జీవితం, ఉద్యమ సమయంలో భోజనం లేకపోవడం, పార్టీలోని నాయకులు చేసిన మోసం, కలగలిసి తీవ్ర మానసిక ఒత్తిడికి గురి అయిన కేశవరావు1953, మార్చి 29న తన 46వ ఏట మరణించారు.

# కొత్తకొండ ఆలయ అభివృద్ధికి ప్రత్యేక కృషి

## - రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

**భీమదేవరపల్లి, సెప్టెంబర్ 02 :** కొత్తకొండ వీరభద్ర స్వామి ఆలయ అభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తానని బీసీ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హామీ ఇచ్చారు. సోమవారం మండలంలోని కొత్తకొండ వీరభద్రస్వామి ఆలయ క్షేత్రంలో నక్షత్ర దీక్ష మాలవిరమణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్తకొండ గుట్టపై చారిత్రిక విశేషాలు ఎన్నో ఉన్నాయని, గుట్టపై శిథిలావస్థలో వీరభద్ర స్వామి ఆలయము, స్వయంభూ శివాలయం, 7 కోనేరులు, తాసిల్ పన్ను తదితర పలు కట్టడాలు ఉన్నాయని ఆయన వివరించారు. ఈరోజు గుట్టను ఎక్కడం వల్ల ఇవన్నీ నా కల్లారా చూసారని వివరించారు. ఇది మహాభాగ్యమని ఆయన కొనియాడారు.



జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం లోని గోదావరి పరివాహక ప్రాంతాలైన ఎర్దండి, మూల రాంపూర్ (సదర్ మాట్ బ్రిడ్జి) ను సోమవారం కలెక్టర్, ఎస్పీ పర్యవేక్షించినట్లు తెలిపిన ఎస్సై ఏ. అనిల్

# మంత్రి పొన్నం ప్రభాకర్ ఇరుముడి కార్యక్రమములో పాల్గొన్న ప్రణవ్ బాబు

## కొత్తకొండ వీరభద్రున్ని దర్శించుకున్న ప్రణవ్





**జమ్మికుంట సెప్టెంబర్ 02 (ప్రజామంటలు) :** రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ భద్రకాళి సమేత శ్రీ వీరభద్ర స్వామి నక్షత్ర మాలధారణ విరుముడి కార్యక్రమంలో హుజురాబాద్ నియోజకవర్గ ఇన్చార్జి ప్రణవ్ బాబు పాల్గొన్నారు. అనంతరం ఆలయంలో ప్రణవ్ బాబు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొండపై కొలువై ఉన్న శివలింగాన్ని మెట్లమార్గం ద్వారా మంత్రితో కాలినడకన వెళ్లి దర్శించుకున్నారు. హుజురాబాద్ ప్రజలు సుభిక్షంగా, పాడిపంటలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకున్నారు.

# బెదిరింపులతో బలవంతపు వసూళ్లకు పాల్పడిన వ్యక్తి అరెస్టు



**కోరుట్ల సెప్టెంబర్ 02 (ప్రజామంటలు):** కోరుట్ల సర్కిల్ ఆఫీస్ లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కోరుట్ల సీ.ఐ బి. సురేష్ బాబు మాట్లాడుతూ.... కోరుట్ల మండలం ఐలాపూర్ గ్రామానికి చెందిన సుందరగిరి లక్ష్మీనరసయ్య వయస్సు 40 సంవత్సరాలు అనునతను గత పది రోజుల నుండి కోరుట్ల పట్టణానికి చెందిన దాసరి రాజశేఖర్ కు నిందితుడు వివిధ ఫోన్ నెంబర్ల ద్వారా ఫోన్ చేస్తూ నీవు రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నావు కనుక నీవు కోటి రూపాయలు ఇవ్వాలని ఫోన్ కాల్స్ చేస్తూ బెదిరిస్తూ చివరకు 10 లక్షలు ఇవ్వాలని లేదంటే చంపుతానని బెదిరింపులకు గురి చేయుచు తేదీ .31. 8 .2024 రోజున సాయంత్రం రాజశేఖర్ కు చెందిన టీవీ సర్వీసింగ్ సెంటర్ కు వచ్చిన నిందితుడు అక్కడ ఉన్న రాజశేఖర్ ను కత్తితో పొడిచి చంపుతానని తాను అడిగిన 10 లక్షలు రెండు రోజుల్లో సిద్ధం చేసుకోమని హెచ్చరించి వెళ్లిన నేపథ్యంలో నిన్న సాయంత్రం సిఐ సురేష్ బాబు స్థానిక ఎస్సై ఎస్. శ్రీకాంత్ మరియు సిబ్బంది పురుషోత్తం, ఎల్లయ్య , శ్రీనివాసులు నిందితుడు లక్ష్మీ నరసయ్య ను రాజశేఖర్ కు చెందిన ఎస్.ఎం.టి.వి. సర్వీసింగ్ సెంటర్ వద్ద అదుపులోకి తీసుకోవడం జరిగింది. అతని వద్దనుండి ఒక సెల్ ఫోన్ ఒక కత్తి మరియు ఒక మోటార్ సైకిల్ స్వాధీనం చేసుకొని పోలీస్ స్టేషన్ కు తీసుకువచ్చి ఈరోజు రిమాండ్ చేసి కోర్టుకు తరలించనైనది. నిందితుడిని పట్టుకోవడంలో కృషిచేసిన సిబ్బందిని మెటుపల్లి డిఎస్పి ఉమామహేశ్వరరావు అభినందించడం జరిగింది. అదేవిధంగా ఇలాంటి అక్రమ వసూళ్లకు పాల్పడే వారిపట్ల కఠిన చర్యలు తీసుకొవడం జరుగుతుంది. గతంలో ఇదేవిధంగా అక్రమ వసూళ్లకు పాల్పడిన ఇద్దరు వ్యక్తులపై పీడి ఆక్ట్ నమోదు చేసి జైలుకు తరలించడం జరిగిందని ఆయన హెచ్చరించడం జరిగింది.

# పీచర పాలకేంద్రం పాలకవర్గం నిర్ణయమే ఫైనల్

## పీచర గ్రామం పాలకేంద్రం వద్ద స్వార్థపరుల హల్ చల్

**డెయిరీలో మహిళలు కాకుండా, మగ స్వార్థపరులు ఆందోళన చేయడం అనైతికం - పాలకవర్గం**



**వేలేరు ప్రజామంటలు ప్రతినిధి షరీఫ్**



**వేలేరు సెప్టెంబర్ 02 (ప్రజామంటలు) :** వేలేరు మండలంలోని పీచర గ్రామంలో కొంతమంది స్వార్థపరులు వారి స్వప్రయోజనాల కోసం ముల్కనూర్ మహిళా సహకార డెయిరీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పీచర గ్రామ డెయిరీపై ఆరోపణలు చేయడం సరికాదని పాలకవర్గం స్పష్టం చేసింది. పాలకవర్గ సభ్యులు అందించిన సమాచారం మేరకు గ్రామానికి చెందిన మాచర్ల కనకరాజు, వేముల చంద్రమౌళి పీచర డెయిరీ నిబంధనలు అతిక్రమించడంతో వారిని డెయిరీ సభ్యత్వం నుంచి తొలగించామని, అది దృష్టిలో పెట్టుకొని, పాలకవర్గం డెయిరీ సిబ్బందిపై అసభ్య పదజాలంతో దూషించిన సందర్భంలో వారిపై వేలేరు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయడం జరిగిందని అన్నారు. దేశవ్యాప్తంగా మహిళలు పూర్తిస్థాయిలో నిర్వహిస్తున్న మహిళా సహకార డెయిరీ ఎదుగుదలను ఓర్వలేక వ్యక్తిగత స్వార్థంతో ఇద్దరు వ్యక్తులు ఆరోపణలు చేయడం సరి కాదని అన్నారు. ఇప్పటివరకు పీచర-2 డెయిరీ నిబంధనల ప్రకారమే సిబ్బంది మరియు పాలకవర్గం పనిచేస్తున్నారని అన్నారు.

**నిరాదార ఆరోపణలు**

పీచర గ్రామంలో డైయిరీకి సొంత భవనం లేకపోవడంతో అదే గ్రామంలో స్థలాన్ని కొనుగోలు చేశారు. కానీ కొంతమంది స్వార్థపరులు పీచర - 2 మహిళా పరస్పర సహాయక పాల ఉత్పత్తిదారుల సహకార పరిమిత సంఘం పీచర పేరుతో రిజిస్ట్రేషన్ చేయించారు. కానీ సదరు వ్యక్తులు కనీస అవగాహన లేకుండా సంఘ భవనం రిజిస్ట్రేషన్ అధ్యక్ష కార్యదర్శుల పేరు మీద ఎలా చేస్తారని నిరాధార ఆరోపణలు మీడియా ముందు వ్యక్తం చేశారు.

**మహిళలపై అసభ్య పదజాలంతో దూషణ**

పూర్తిస్థాయిలో ప్రపంచవ్యాప్తంగా పేరు పొందిన మహిళా డెయిరీ సిబ్బందిపై సదరు వ్యక్తులు అసభ్య పద జలాన్ని వాడడంతో పీచర డెయిరీ పాలకవర్గం, సిబ్బంది వేలేరు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు.

# ఉత్తమ ప్రతిభ కనబరిచిన అదనపు ఎస్పీ భీమ్ రావు అభినందించిన జిల్లా ఎస్పీ



**జగిత్యాల సెప్టెంబర్ 02 (ప్రజామంటలు):** గత పార్లమెంట్ ఎన్నికల సమయంలో భారత ప్రధాని జిల్లా పర్యటనలో సందర్భంగా భద్రతాపరంగా నిర్వహించిన డ్యూటీలో భాగంగా ఉత్తమ ప్రతిభ కనబరిచినందుకుగాను అదనపు ఎస్పీ (ఏ ఆర్) భీమ్ రావు కి రాష్ట్ర డిజిపి కమండేషన్ లెటర్" ని ప్రకటించారు. ఈ సందర్భంగా జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఎస్పీ అశోక్ కుమార్ అభినందించి సదరు కమండేషన్ సర్టిఫికెట్ ను వారికి అందజేసి అభినందించారు. ఇదే స్ఫూర్తితో పనిచేస్తూ మరిన్ని రివార్డులు, అవార్డులు సాధించాలని సమర్థవంతమైన సేవలు ద్వారా పోలీసులకు గుర్తింపు లభిస్తుందని అన్నారు.

# కోరుట్ల తహాశీల్దార్ కార్యాలయం చుట్టూ జలమయం

# అక్రమ నిర్మాణాల వల్లే ఈ దుస్థితి

## ప్రజాసంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ పేట భాస్కర్





**కోరుట్ల సెప్టెంబర్ 02 (ప్రజామంటలు):** రాష్ట్రంలో రెండు రోజులగా కురుస్తున్న భారీ వర్షాలకు జగిత్యాల జిల్లా కోరుట్ల తహాశీల్దార్ కార్యాలయం చూట్టూ జలమయంగా మారిందని, చెరువులు కుంటలు కబ్జా చేస్తు అక్రమ నిర్మాణాలు చేయడం వల్లే ప్రజలకు ఈ దుస్థితి ఏర్పడిందని తెలంగాణ ప్రజాసంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ పేట భాస్కర్ ఆరోపించారు. సోమవారం కోరుట్లలో జలమయం అయినా ప్రాంతాలను కోరుట్ల డెవలప్మెంట్ ఫోరమ్ పక్షాన వివిధ సంఘాల నాయకులతో కలిసి పర్యవేక్షించారు. అనంతరం తహాశీల్దార్ ఇట్యాల కిషన్ కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా పేట భాస్కర్ మాట్లాడుతూ.... పట్టణంలో ఆదర్శనగర్, ముత్యాలవాడ, అయిలాపూర్ రోడ్, తాళ్ల చెరువు లోతట్టు ప్రాంతాలు ఇంక కొన్ని వార్డులు జలమయం అయ్యాయని ఆయన పేర్కొన్నారు. వాగు పరివాహక ప్రాంతం చెరువులు కుంటలు బఫార్ జోన్ లలో అక్రమ నిర్మాణాలు చేయడం కోరుట్లలో ఆనవాయితీగా మారిందని, రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా హైదరాబాద్ లో తీసుక వచ్చిన హైడ్రా తరహా చట్టాన్ని కోరుట్లలో కోడ్రా పేరిట చట్టాన్ని తెచ్చి ఆక్రమ నిర్మాణాలపై కొరడా జులుపించి ప్రభుత్వ స్థలాలను కాపాడాలని ప్రభుత్వాన్ని పేట భాస్కర్ కోరారు. ఈ కార్యక్రమంలో కోరుట్ల డెవలప్మెంట్ ఫోరమ్ అధ్యక్షులు చెన్న విశ్వనాథం, నాయకులు చింత భూమేశ్వర్, ఇట్యాల రాజేందర్, షాహేద్ మహ్మద్ షేక్, ఎలిశెట్టి గంగారెడ్డి, ఆలీ నవాబ్, శనిగారపు రాజేష్, సురేష్, ప్రసాద్, అఫీజ్ తదితరులు పాల్గొన్నారు.

# గొల్లపెల్లి మాడల్ స్కూల్ గర్ల్స్ హాస్టల్ ను సందర్శించిన ప్రత్యేక అధికారి ఎల్. సాయిబాబా



**గొల్లపల్లి సెప్టెంబర్ 02 (ప్రజామంటలు):** గొల్లపల్లి మండల కేంద్రంలోని మాడల్ స్కూల్ గర్ల్స్ హాస్టల్ ను సందర్శించిన ప్రత్యేక అధికారి మండల ఎల్. సాయిబాబా సందర్శించి విద్యార్థినిలకు నిత్యము మెనూ రికార్డుల పరిశీలించారు. సరఫరా చేయుచున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి వారితో పాటు మధ్యాహ్న భోజనం చేసి నాణ్యతను పరిశీలించారు. అదే విధముగా హాస్టల్ పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని కేర్ టేకర్ కు సూచించారు. హాస్టల్ గదులను పరిశీలించి వాటి యొక్క పరిశుభ్రతను గమనించారు. హాస్టల్లో పిల్లలకు సరఫరా చేయుచున్న భోజనము నాణ్యత బాగానే ఉన్నట్టుగా గుర్తించారు. అనంతరం మహాత్మా జ్యోతి బాపూలే రావు బాలికల హాస్టల్ సందర్శించి పరిసరాల్లో నీరు నిలిచి ఉన్న ప్రాంతాలలో ఆయిల్ బాల్స్ గ్రామ పంచాయతీ సిబ్బందిచే వేయించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ ప్రత్యేక అధికారి సాయిబాబా, ఎంపీడీవో రాము రెడ్డి, ఎంపిఓ సురేష్ రెడ్డి, కేర్ టేకర్ సుజాత, కార్యదర్శి మధు, మహేష్ పాల్గొన్నారు

# నిజమైన ప్రజాసేవ కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యము

**- మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ చోరువుతో హుస్నాబాద్ అభివృద్ధిపై అడుగులు.**

**- యూత్ కాంగ్రెస్ మాజీ మండల అధ్యక్షులు అంబాల స్వామి**



**ఎల్కతుర్తి సెప్టెంబర్ 2 ప్రజామంటలు :** హుస్నాబాద్ నియోజకవర్గ అనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో యూత్ కాంగ్రెస్ మాజీ మండల అధ్యక్షులు అంబాల స్వామి మాట్లాడుతూ నిజమైన ప్రజాసేవ చేసే పార్టీ ఏదైనా ఉందంటే అది కాంగ్రెస్ పార్టీ అని కాంగ్రెస్తోనే సాధ్యమవుతుందని అన్నారు కాంగ్రెస్ పార్టీ స్వాతంత్ర ఉద్యమంలో బ్రిటిష్ వారు నుంచి స్వాతంత్రాన్ని సాధించిన నాటి నుండి దేశం అభివృద్ధి వైపు అడుగులు వేసింది కాంగ్రెస్ పార్టీ అని దేశ అభివృద్ధికి వ్యవసాయ పారిశ్రామిక విద్యారంగాలను శరవేగంగా నెలకొల్పిన పార్టీ కాంగ్రెస్ పార్టీ అని తెలిపారు. వ్యవసాయ రంగంలో సాగు మరియు మంచినీటి సరఫరా కోసం దేశవ్యాప్తంగా అనేక నదులను అనుసంధానం చేస్తూ ప్రాజెక్టులు కట్టి అందించింది కాంగ్రెస్ పార్టీ అని విద్యారంగం విదేశీయులతో పోటీపడాలనే ఉద్దేశంతో ప్రతి రాష్ట్రంలో ఐఐఎంఎస్ ఐఐటి ట్రిబుల్ ఐటీ లాంటి విద్యాసంస్థలను జాతీయస్థాయిలో నెలకొల్పింది అని. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో స్వర్గీయ మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ప్రతి నిరుపేద వాడికి కార్పొరేట్ స్థాయిలో విద్య వైద్యము సంక్షేమ ఫలాలు అందాలనే ఉద్దేశం రాజీవ్ ఆరోగ్య చిట్టచివరిగా ఉన్న గ్రామం నుండి ప్రభుత్వ వైద్యశాలకు సౌకర్యాన్ని కల్పించుట కోసం108 వాహనాలను సమకూర్చి ప్రతి నిరుపేద విద్యార్థి కార్పోరేట్ స్థాయితో పోటీపడాలనే ఉద్దేశంతో మోడల్ స్కూల్స్ కు పునాదులు వేసింది కాంగ్రెస్ పార్టీ అని స్వరాష్ట్ర తెలంగాణ కోసం తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకోవాలనే లక్ష్యంలో ఎంతోమంది విద్యార్థులు అమరులవుతున్నారని తెలంగాణ రాష్ట్రం ఇస్తే పక్క రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీ అధికారం కోల్పోతుందని తెలిసి కూడా న్యాయబద్ధమైన డిమాండ్ గా ఉన్నటువంటి తెలంగాణ రాష్ట్రం ఇవ్వాలని ఉద్దేశంతో సోనియాగాంధీ తెలంగాణ ప్రజల యొక్క చిరకాల కోరిక స్వరాష్ట్ర తెలంగాణను నెరవేర్చారు సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో బి ఆర్ ఎస్ పార్టీకి అధికారమిస్తే ఏ లక్ష్యం కోసం అయితే తెలంగాణ ఉద్యమం మొదలుపెట్టారో ఆ ఉద్యమానికి విరుద్ధంగా పరిపాలన చేసింది బిఆర్ఎస్ పార్టీ అని అన్నారు నిజమైన పరిపాలన ప్రజా పాలన అందాలంటే కాంగ్రెస్ తోనే సాధ్యమని గమనించిన ప్రజలు కాంగ్రెస్ పార్టీకి అధికారాన్ని చేపట్టారు అని రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి ఇచ్చినటువంటి ఆరు గారెంటీలు పూర్తిస్థాయిలో అమలు జరుగుతుందని ఆనాటి దేశ స్వా తంత్ర ఉద్యమం నుండి నేటి తెలంగాణ రాష్ట్రంలో ప్రజా పాలన నిజమైన ప్రజాసేవ చిట్టచివరి గ్రామంలోని నిరుపేదవానికి సంక్షేమ ఫలాలు విద్య వైద్య రంగాల్లో అందాలంటే కాంగ్రెస్ పార్టీ సాధ్యమవుతుందని మరో 10 సంవత్సరాలు తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వమే పరిపాలన చేస్తుంది అని హుస్నాబాద్ నియోజకవర్గానికి పొన్నం ప్రభాకర్ గౌడ్ ఎమ్మెల్యేగా మంత్రిగా అవ్వడం హుస్నాబాద్ నియోజకవర్గ ప్రజలు అందించినటువంటి ఆశీర్వాదము అభివృద్ధికి అడుగులు అని తెలిపారు

# రిజర్వేషన్ అంటే "కేటాయింపు", "పక్కకు పెట్టుట", "దాచిపెట్టుట" అని అర్థాలు... రొట్టెముక్క పిల్లు కథ

**రెబ్బెన సెప్టెంబర్ 2 ప్రజా మంటలు :** పిల్లులకు రొట్టె దొరుకుతే సెరి సమానంగ పంచుకుంటే గొడవే లేదు కోతి పెద్ద మనిషి అయ్యేదే కాదు కానీ అవి నాకంటే నాకు అని పంచాయితీ పెట్టుకొని పంచే అధికారం కోతి చేతిలో పెట్టడం వల్ల వాటిని మోసం చేసి మొత్తం ఆదే మింగే అవకాశం వచ్చి! ఇదే కథ మన దేశంలో జరుగుతుంది మెజారిటీ గ ఉన్న బహుజనులు (85%) వాళ్ళలో వాళ్ళు కలహించుకొని వివిధ కులాలు, ఉప కులాలు, వర్గాలుగ విడిపోయి ఈ దేశ సంపద, వనరులు, ఉద్యోగ, ఉపాది అవకాశాలు పంచే అధికారం అల్పసంఖ్యాకులైన అగ్ర వర్ణాల(15%) చేతిలో పెడితే రాజ్యాంగ బద్దంగ అసలు రిజర్వేషన్లు వాస్తవంలో అనుభవిస్తున్న ఒక ఉద్యోగాలనే పరిశీలిస్తె ఎలా ఉందో చూడండి కేవలం ఉద్యోగాలే ఇక్కడ చర్చిస్తున్నాము ఇంక ఈ దేశ సంపద, సహజ వనరులు, వ్యాపారాల లెక్కలు వేరే... భారతదేశ జనాభా 140 కోట్లు ఇంచుమించు అగ్రవర్ణాలు - 36 కోట్లు ST , SC , BC , MINOR-ITY లు ౦- 104 కోట్లు అనుకున్నా.బి .

రిజర్వేషన్లలో ఉద్యోగాలు , పదవులు ఎవరు అనుభవిస్తున్నారో చూద్దాం ... !!

ST లకు : - 7.5 % రిజర్వేషన్లు
SC లకు : - 15 % రిజర్వేషన్లు
BC లకు : - 27 % రిజర్వేషన్లు..

ఉన్న రిజర్వేషన్లలో అనుభవిస్తున్నదిబి ఎంతో చూద్దాం ..... ! !

1) ST ల జనాభా : - 7 %
ఉద్యోగుల శాతం : - 3 %
2) SC ల జనాభా : - 18%
ఉద్యోగుల శాతం : - 8 %
3) BC ల జనాభా : - 52 %
ఉద్యోగుల శాతం : - 7 %
4) Minority జనాభా : - 8%
ఉద్యోగుల శాతం : - 1%
5) OC ల జనాభా : - 15 %
ఉద్యోగుల శాతం : - 81 %



ఇప్పుడు చెప్పండి ఈ దేశ అవినీతికి, పేదరికానికి, వెనుకబాటు తనానికి, వినాశనానికి అసలు కారణం ఎవ్వడో?? అసలు రిజర్వేషన్ అనుభవిస్తుంది ఎవ్వడో???

# సహకార సంఘం సొత్తు రికవరికి హైకోర్టు సానుకూలం

- ప్రత్యర్థి పిటిషన్ ను రద్దు చేసిన హైకోర్టు
- మిత్తితో సహా వసూలు చేస్తాం
- సహకార సంఘం అధ్యక్షుడు శ్రీపతి రవిందర్ గౌడ్



02 ఈఎల్ 01: సహకార సంఘంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న పాలక వర్గ సభ్యులు

ఎల్కతుర్తి, సెప్టెంబరు 2 : ఎల్కతుర్తి మండల సహకార సంఘంలో స్వాహా జరిగిన డబ్బుల రికవరీకి హైకోర్టు సానుకూలంగా తీర్పును ఇవ్వడంతో పాటు ప్రత్యర్థి దాఖలు చేసి పిటీషన్ ను రద్దు చేసినట్లు సహాకార సంఘం అధ్యక్షుడు శ్రీపతి రవిందర్ గౌడ్ పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలోని సహాకార సంఘంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో చైర్మన్ రవిందర్ గౌడ్ తో పాటు పాలక వర్గం సభ్యులు వివరాలు వెల్లడించారు. ఎల్కతుర్తి సహాకారం సంఘం 2013 -2018 సంవత్సరానికి చెందిన పాలక వర్గం హయాంలో అప్పటి చైర్మన్ గోలి రాజేశ్వర్ రావు, సీఈవో కొమ్మిడి వినేయ్, ఎరువులు గోదాం కీపర్ నవీన్ కుమార్ లు కలిసి సంఘం నుంచి రూ.1,95,11,376 కోట్ల ప్రజల సొమ్మును స్వాహా చేసినట్లు పేర్కొన్నారు. ఇందులో మాజీ చైర్మన్ గోలి రాజేశ్వర్రావు రూ.7,54,500 లక్షలు, సీఈవో వినేయ్ రూ.32,41,223 లక్షలు స్వంతానికి వాడుకోవడంతో పాటు ఇద్దరు కలిసి ఆదనంగా మరో రూ.1,47,56,850 కోట్లు వాడుకున్నారు. అలాగే గోదాం కీపర్ నవీన్ కుమార్ రూ. 9,58,802 లక్షలు స్వాహా చేసినట్లు సంఘం అడిట్లో అధికారులు ధృవీకరించినట్లు పేర్కొన్నారు. స్వాహా ఐన సొత్తు రికవరీకి సహాకార సంఘం అధికారులు కో ఆపరేటివ్ ట్రిబునల్లో కేసు నమోదు చేసి డబ్బులు చెల్లించాలని ఉత్తర్వులు జారీ చేశారు. దీన్ని సవాలు చేస్తూ మాజీ చైర్మన్ గోలి రాజేశ్వర్రావు కోర్టును ఆశ్రయించారు. ప్రతి వాదనలు విన్న కోర్టు అవినీతికి గురైన సొమ్మును రికవరీ చేయాలని తీర్పు ఇవ్వడంతో వారి ఆస్తులను సహకార సంఘం బ్యాంక్ కు అటాచ్ చేశారు. గడువు లోపు డబ్బులు చెల్లించకుంటే ఆస్తులు వేలం వేయాలని సూచించడంతో పై వ్యక్తులకు నోటీసులు జారీ చేశారు. ఈ క్రమంలో గోదాం కీపర్ నవీన్ కుమార్ రూ. 10 లక్షలు సంఘానికి చెల్లించాడు. కోర్టు సచ్చార్జీ ఆర్డర్ పై మాజీ చైర్మన్ హై కోర్టును ఆశ్రయించడంతో కోర్టు 2024 జనవరి 29న రూ. 35 లక్షలు సంఘంలో డిపాజిల్ చేయడంతో పాటు మిగితా డబ్బులు చెల్లిచండానికి సమయం ఇచ్చిందన్నారు.దీంతో రాజేశ్వర్రావు రూ. 9 లక్షల నగదు, రూ.26 లక్షలకు పోస్టేడ్ చెక్కులను సంఘానికి అందజేసినట్లు తెలిపారు. చెక్కులు చెల్లక పోవడంతో సరైన సమయలంలో డబ్బులు జమచేనందున 2024 జూలై 26న హైకోర్టు రాజేశ్వర్రావు దాఖలు చేసిన పిటీషన్ ను కొట్టి వేసినట్లు సూచించారు.

**రైతులు సొమ్మును మిత్తితో సహా రికవరీ చేస్తాం.**

- సొసైటీ చైర్మన్ శ్రీపతి రవిందర్ గౌడ్

సహాకార సంఘంలో సభ్యుల సొమ్మును స్వాహ చేసిన వ్యక్తుల వద్ద నుంచి పూర్తి డబ్బులు మిత్తితో సహా రికవరీ చేస్తామని సొసైటీ చైర్మన్ శ్రీపతి రవిందర్ గౌడ్ అన్నారు. ఎవరిపై ఎలాంటి కక్ష్య సాధింపులు చేయడం లేవన్నారు. రైతుల సొమ్మును తిరిగి సంఘంలో అధికారుల సూచనల మేరకు జమచేయించడం జరుగ సుతుందన్నారు. కార్యక్రమంలో సంఘం వైస్ చైర్మన్ మునిగడప శేషగిరి, డైరెక్టర్లు ముప్ప మహేందర్, లోకిని సూరయ్య, కాగితాల శ్రీనివాస్, కృష్ణమూర్తి, బరీదుల రాజిరెడ్డి, మంతూర్తి సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## గోదావరి తీర ప్రాంత గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

### జువ్వాడి కృష్ణారావు



**ఇబ్రహీంపట్నం సెప్టెంబర్ 02 (ప్రజామంటలు):** శ్రీరామ్ సాగర్ ప్రాజెక్టు పూర్తిగా నిండి నిండుకుండలా మారిందని దీంతో ఎస్సారెస్పీ అధికారులు ప్రాజెక్టు గేట్లు అన్ని ఎత్తివేసారని తీర ప్రాంత గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు జువ్వాడి కృష్ణారావు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సోమవారం పత్రిక విలేకరులతో మాట్లాడుతూ.... తెలంగాణా వర ప్రధాయిని అయిన శ్రీరాం సాగర్ ప్రాజెక్టులో పూర్తిస్థాయిలో నీరు చేరడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. ప్రాజెక్టు పూర్తిస్థాయికి నీటిమట్టం చేరడంతో రెండు పంటలకు కూడా తెలంగాణలో సమృద్ధిగా నిరంధించవచ్చని సాగు నీటితో పాటు తాగు నీటికి కూడా ఇబ్బందులు ఉండవని అన్నారు, ఈ సమయంలో మన తెలంగాణ రాష్ట్రమే కాకుండా ఎగువన ఉన్న మహారాష్ట్రలోని గోదావరి బేసిన్ లో భారీ వర్షాలు కురవడం వల్ల మహారాష్ట్రలోని గైక్వాడ్ ప్రాజెక్టుతో సహా ప్రాజెక్టులన్ని పూర్తిగా నిండిపోయాయని దీంతో విపరీతమైన వరద నీరు రావడం వల్ల మన తెలంగాణ రాష్ట్రంలోని శ్రీరామ్ సాగర్ ప్రాజెక్టు కూడా పూర్తిగా నిండిపోయిందని పైనుండి ప్రాజెక్టులోకి సుమారు 1,50,000 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతుందని, దీంతో అధికారులు ప్రాజెక్టు మొత్తం గేట్లు ఎత్తివేసారని అలాగే వరద కాలువ ద్వారా 6000 క్యూసెక్కుల నీటిని కూడా వదిలారని ఇంకా ప్రవాహం పెరుగుతున్నందున నీటిని ఇంకా దిగువకు వదిలే అవకాశం ఉన్నందున కోరుట్ల నియోజకవర్గంలోని ఇబ్రహీంపట్న మండలంలోని కోమటి కొండాపూర్, మూలరాంపూర్, ఎద్దండి, వేముల కుర్తి, మల్లాపూర్ మండలంలోని మొగిలిపేట, ఓబులాపూర్, ఓబులాపూర్ తండా, దాం రాజుపల్లి, సంఘం, శ్రీరాంపూర్, కొత్తదామ్ రాజు పల్లె, వాల్గొండ నుండి ధర్మపురి వరకు తీర ప్రాంత గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, పశువుల కాపరులు రైతులు నది వైపు వెళ్ళవద్దని, ఇతరులు ఎవరు కూడా వెళ్ళవద్దని, అలాగే వరద కాలువకు బిగించుకున్న వ్యవసాయమోటార్ పంపుసెట్లు అన్ని కూడా రైతులు అప్రమత్తమై కాపాడుకోవాలని జువ్వాడి కృష్ణారావు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## జిల్లా పరిధిలో సిటీ పోలీస్ యాక్ట్ అమలు

### జిల్లా ఎస్పీ అశోక్ కుమార్



**జగిత్యాల సెప్టెంబర్ 02 (ప్రజామంటలు):** జిల్లాలో శాంతి భద్రతలను దృష్టిలో వుంచుకొని నెల రోజుల పాటు (సెప్టెంబర్ 1వ తేది నుండి 30 వరకు) జిల్లా వ్యాప్తంగా పోలీసు యాక్ట్ అమలులో ఉంటుందని జిల్లా ఎస్పీ తెలిపారు. దీని ప్రకారం పోలీసు అధికారుల అనుమతి లేకుండా ఎలాంటి ధర్నాలు, రాస్తా రోకోలు, నిరసనలు, ర్యాలీలు, పబ్లిక్ మీటింగ్లు, సభలు, సమావేశాలు నిర్వహించరాదని అన్నారు. శాంతి భద్రతలకు భంగం కలిగించే విధంగా మరియు ప్రభుత్వ ఆస్తులకు నష్టం కల్గించే చట్ట వ్యతిరేక కార్యక్రమాలు చేపట్టరాదని ఎస్.పి. సూచించారు. కాబట్టి జిల్లా ప్రజలు పోలీసువారికి ఇట్టి విషయంలో సహకరించాలని శాంతిభద్రతల పరిరక్షణకు నిరంతరం శ్రమిస్తున్న పోలీసులకు అన్ని వర్గాల ప్రజలు సహకారం అందించాలని సూచించారు.



జగిత్యాల పట్టణంలోని ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి నివాసం ఇందిరా భవన్ లో రెడ్డి సంఘం కార్యవర్గంలో ఏకగ్రీవమైన మరియు ఎన్నికలచే ఎన్నుకోబడిన అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, కార్యదర్శులు వివిధ హెూదాలో ఎన్నికైన కార్యవర్గ సభ్యులు ఎమ్మెల్సీ జీవన్ రెడ్డిని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేయగా వారికి శుభాకాంక్షలు తెలిపి రెడ్డి సంఘ సభ్యులను శాలువలతో సన్మానించిన ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి.

## సమీక్షలతో సరిపెట్టొద్దు తక్షణ చర్యలు చేపట్టాలి

### సిపిఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవ రెడ్డి



**జమ్మికుంట సెప్టెంబర్ 02 (ప్రజామంటలు):** గత మూడు రోజులుగా జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలతో జనజీవనం అనేక అవస్థలు పడుతున్నారని అధికార యంత్రాంగం సమీక్షలతో సరిపెట్టకుండా, తక్షణ సహాయ చర్యలు తీసుకొని బాధితులకు అన్ని విధాలుగా అండగా ఉండాలని సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవ రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం ముకుంద లాల్ మిశ్రా భవన్లో వాసుదేవ రెడ్డి మాట్లాడుతూ.... వర్షాల మూలంగా కరీంనగర్ జిల్లా కేంద్రంతో పాటు అనేక గ్రామాలకు రాకపోకలు స్తంభించిపోయాయని, అనేకచోట్ల లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయని, కాలనీలు మొత్తం నీట మునిగాయన్నారు. అనేకచోట్ల చెట్లు నేలకులాయన్నారు. చెరువులు కుంటలు అలుగులు పారుతున్నాయని ఇసుకమేటలతో పంట పొలాలు దెబ్బతిన్నాయని వెంటనే క్షేత్రస్థాయిలో అధికారులు సర్వే నిర్వహించి రైతులకు నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని అన్నారు. వందల ఎకరాలు వరి పంటలు నీట మునిగాయన్నారు. జిల్లాలో అనేక ఇండ్లు కూలిపోయాయని వెంటనే రెవెన్యూ అధికారులు బాధితులకు తక్షణ సహాయం అందించి బాధితులను ఆదుకోవాలని కోరారు. జిల్లాలో వరదలతో అనేక రోడ్లు కొట్టుకుపోయాయని యుద్ధ ప్రాతిపదికన రోడ్లు పునర్మించాలని డిమాండ్ చేశారు. నగరంలో ప్రధాన రోడ్లన్నీ జలమయం అయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. కరీంనగర్ కలెక్టరేట్ ప్రాంగణం కూడా జలమయమైందన్నారు. స్మార్ట్ సిటీ పేరుతో వందల కోట్ల రూపాయలు వెచ్చించి అభివృద్ధి పనులు చేశామని చెప్పుకుంటున్న పాలకవర్గం మాటలు నీటి మూట లే అని తేటతెల్లమైందన్నారు. నాసిరకం పనులు చేయడమే కాకుండా ప్రణాళిక బద్ధంగా అభివృద్ధి పనులు చేయకుండా ఇష్టం వచ్చిన రీతిలో పనులు చేయడం మూలంగా డ్రైనేజీ వ్యవస్థ పూర్తిగా అస్తవ్యస్తంగా తయారైంది అన్నారు. దీనికి తోడు చెరువులు, కుంటలు అన్యక్రాంతం కావడం మూలంగా వర్షపు నీరు మొత్తం కాలనీలకు చేరుకుందన్నారు. హైదరాబాద్ హైడ్రా తరహాలో కరీంనగర్ లో కూడా ఒక సంస్థను ఏర్పాటు చేసి అక్రమ నిర్మాణాలను తొలగించాలని డిమాండ్ చేశారు. చెరువులు,కుంటలు ఎస్సారెస్పీ భూములు వందల ఎకరాలు అన్యాక్రాంతం అయినప్పటికీ రెవెన్యూ అధికారులు చోద్యం చూస్తున్నారని అన్నారు. సామాన్యుడు నిలువ నీడ కోసం గుడిసె వేసుకుంటే వెంటనే వచ్చి తొలగించే అధికారులు పెద్ద ఎత్తున గోడౌన్లు, ఆఫీసులు, ఇండ్లు నిర్మిస్తే ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం సిగ్గుచేటు అన్నారు. పాలకవర్గ పార్టీల ప్రజాప్రతినిధుల ఒత్తిడిలకు తలగ్గిన రెవెన్యూ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు చోద్యం చూశారన్నారు . ఒకవైపు సీజనల్ వ్యాధులతో ప్రతి ఇంట్లో జ్వర పీడుతులు ఉన్నారని, ఈ వర్షాలతో దోమలు మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. వెంటనే కాలనీలలో, గ్రామాలలో బ్లీచింగ్ పౌడర్, ఫాగింగ్, క్లీనింగ్ చేయాలని డిమాండ్ చేశారు. ఖాళీ ప్రదేశాల్లో చెత్తా, చెదారం, చెట్లుతొలగించి పరిశుభ్రంగా ఉంచాలని డిమాండ్ చేశారు. జిల్లా అధికార యంత్రాంగం సమీక్షలతో సరిపెట్టకుండా యుద్ధ ప్రాతిపదికన సహాయక చర్యలు తీసుకొని బాధితులకు అన్ని విధాలుగా అండగా నిలవాలని వాసుదేవ రెడ్డి కోరారు. ఈ సమావేశంలో జిల్లా కమిటీ సభ్యులు డి. నరేష్ పటేల్, నాయకులు పున్నం రవి, చెలకాని శ్రీనివాస్, ఎం. ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## హరిహరాలయంలో ఘనంగా ముగిసిన శ్రావణ మాస అభిషేకములు



**జగిత్యాల సెప్టెంబర్ 02 (ప్రజామంటలు):** జగిత్యాల పట్టణము బ్రాహ్మణ వీధి హరిహరాలయంలో గత మాసంగా అఖిల బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో శ్రావణమాస అభిషేకములు కొనసాగగా సోమవతి అమావాస్యతో సమాప్తం అయినాయి. ఈ సందర్భంగా పరమశివునికి వివిధ రకాల పుష్పాలతో అలంకరించి అభిషేకం నిర్వహించారు. అదేవిధంగా సీతారాముల పరివార దేవతలకు నారాయణ ఉపనిషత్తుతో ఆంజనేయస్వామికి మన్యు సూక్తంతో అభిషేకాలు నిర్వహించారు. గత మాసంగా వైదిక నిర్వహణ చేసిన అన్యారంభట్ల మృత్యుంజయ శర్మను కంకటి సుధాకర్ శర్మను శేష వస్త్రాలతో సత్కరించారు. శ్రావణ మాసాంతం వరకు ఏక భుక్తంతో దీక్ష కొనసాగించారు.

## పెసరు బండ పరిరక్షణ కమిటీ అధ్యక్షులు అక్బర్ పాషా ఆధ్వర్యంలో

### "పెసరుబండ పరిరక్షణ కోసం కొనసాగుతున్న దీక్షలు"






**జమ్మికుంట సెప్టెంబర్ 02 (ప్రజామంటలు):** జమ్మికుంట ఒకప్పుడు పెసరు బండ గా ప్రసిద్ధి చెందింది. పాత మున్సిపల్ ఆఫీస్ పక్కన 467సర్వే నెంబర్ లో 10 గుంటలు భూమి ఉండేది. దీనిలో ఒక పెద్ద బండ రాయి ఉంటే అందులో ఆ ప్రాంతానికి చెందిన ఒడ్డర సోదరులు బండ కొడుతు జీవించేవారు. కాల క్రమంలో అది పెద్ద మురికి బొంద గ మారింది అందులో పట్టణానికి సంబంధించి డంపింగ్ యార్డ్ గా వాడుకొని చెత్తాచెదారం వేయడం జరిగింది ఆ క్రమంలో చెత్తాచెదారంతో నిండిపోయి చదును అయినటువంటి భూమి, ఆ ప్రక్కన ఉన్న 654 సర్వేనెంబర్ గల ప్రైవేట్ వ్యక్తి ఈ యొక్క 10 గుంటల భూమిని కబ్జా చేసుకుని ప్లాట్లు పెట్టుకొని అమ్ముకోవడం జరిగింది. ఇది గమనించినటువంటి సీనియర్ కాంగ్రెస్ నాయకులు మహమ్మద్ అక్బర్ పాషా పెసరు బండగా ఉన్నటువంటి భూమిని పరిరక్షించాలని ఆ పది గుంటలు బయటకి తీయాలని అవసరమైతే పేదలకు పంచాలని డిమాండ్ చేస్తూ గత నాలుగు రోజుల నుండి జమ్మికుంట మున్సిపల్ ఆఫీసు నందు రిలే నిరాహార దీక్షలు చేయడం జరుగుతుంది. ఈ దీక్ష కు 28వ వార్డుకు చెందిన బిజెపి నాయకురాలు కంకణాల రమా రెడ్డి హాజరై దీక్షకు సంఘీభావం ప్రకటించారు, ఈ దీక్షలో గుర్రం మహేంద్ర నాథ్, నాయకురాలు మెహర్ ఉన్నిసా, అజ్మత్ బేగం, శైలజ, దేవి, నాగమణి, తదితరులు పాల్గొన్నారు.

## మట్టి వినాయకులను పెట్టండి పర్యావరణాన్ని రక్షించండి

### బీజేపీ జిల్లా నాయకులు ఆకుల రాజేందర్





**జమ్మికుంట సెప్టెంబర్ 02 (ప్రజామంటలు):** తెలంగాణ రాష్ట్రంలో కాలుష్య రహిత రాష్ట్రంగా మారాలంటే మన అందరం మట్టి వినాయకుల పెట్టడానికి ప్రోత్సహించాలని అలాంటప్పుడే పర్యావరణాన్ని రక్షించడం వల్ల అవుతామని, దేశం, రాష్ట్రం సుభిక్షంగా ఉండాలంటే మరియు వినాయక మండపాలలో పరిశుభ్రత వాతావరణం ఉంటుందని ఆ వినాయక నిమజ్జ అనంతరం అట్టి మట్టిని పంట పొలాలలో వాడుకోవచ్చని మట్టి వినాయకులను ప్రోత్సహిద్దాం. పర్యావరణ రహితని కాపాడుదాం అనే నినాదంతో ప్రతి మండపం దగ్గరికి వెళ్లి ప్రోత్సహిద్దాం అంటూ హిందు ఉత్సవ సమితి అధ్యక్షులు బిజెపి జిల్లా నాయకులు ఆకుల రాజేందర్ ప్రజలకు పిలుపు నిచ్చాడు.

## విపత్కర సమయంలో అండగా నిలుస్తాం

### సమస్యలను అధికారులతో మాట్లాడుతూ ఎల్లవేళలా బిఆర్ఎస్ పార్టీ పక్షాన అండగా ఉంటాం

### జిల్లా పరిషత్ తొలి చైర్ పర్సన్ దావ వసంతసురేష్



**జగిత్యాల సెప్టెంబర్ 02 (ప్రజామంటలు):** భారీ వర్షాల నేపథ్యంలో జగిత్యాల అర్బన్ & రూరల్ మండల్లాలోని గొల్లపెల్లి రోడ్డు బ్రిడ్జి,మోతే రోడ్డు బ్రిడ్జి, అనంతారం రోడ్డం, పెరకపల్లె బ్రిడ్జిలను పరిశీలించిన జిల్లా పరిషత్ తొలి చైర్ పర్సన్ దావ వసంత సురేష్. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా అధికారులు చూడాలని వర్షాకాలం సందర్భంగా ఎలాంటి సిజినల్ వ్యాధులు ప్రబలకుండా పారిశుధ్య కార్యక్రమాలు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ మహేష్, అర్బన్ మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు తుమ్మ గంగాధర్, రూరల్ మండల నాయకులు పడిగేల గంగారెడ్డి, అర్బన్ మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు ముత్తయ్య, నాయకులు మోహన్, శ్రీపాల్, శ్రీనివాస్, గంగన్న, హరీష్, రాంకి, నీలి ప్రతాప్, భగవాన్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

# నీటి ప్రవాహిత ప్రాంతాలైన 10,25,30 వార్డులో పర్యటించిన

### మున్సిపల్ ఛైర్పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్







**జగిత్యాల సెప్టెంబర్ 02 (ప్రజామంటలు):** వర్షపు నీరు ఎక్కువగా వచ్చిన ప్రాంతాలలో సహాయ చర్యలను ముమ్మరం చేయాలని అధికారులను ఆదేశించారు మరియు ఇండ్లలోకి వచ్చిన నీరుని మోటార్ పంప్ సాయంతో తీసి వేయించాలని అధికారులను ఆదేశించారు. అలాగే ఇండ్ల చుట్టూ చేరిన వర్షపు నీరు మరియు ఇండ్ల లోకి చేరిన వర్షపు నీరు ఉన్న వాళ్లను గుర్తించి పునరావాస కేంద్రాల తరలించి వారికి వసతులు కల్పించాలని ఆదేశించారు. తడిగా ఉన్న విద్యుత్ స్థంబాల, తడి చేతులతో స్టార్టర్లు మోటార్లు స్విచ్ బోర్డులు ఎట్టి పరిస్థితుల్లో ముట్టుకోవద్దని అన్నారు అలాగే చిన్న పిల్లలు కరెంటు వస్తువుల జోలికి రాకుండా తల్లిదండ్రులు జాగ్రత్త వహించాలి. ఇంత తీగల పైన దుస్తులు ఎట్టి పరిస్థితుల్లోనూ ఆరబెట్టుకోకూడదని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య, ఏఈ అనిల్, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ తాటిపర్తి విజయలక్ష్మి దేవేందర్, స్థానిక కౌన్సిలర్స్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# వేద విద్య సామ్రాట్ సత్యచారి ని సన్మానించిన మాజీ సర్పంచ్



**గొల్లపల్లి సెప్టెంబర్ 02 (ప్రజామంటలు):** ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ బుక్ ఆఫ్ రికార్డ్ తెలుగు సాంస్కృతిక వేద విద్య సామ్రాట్ అవార్డు పొందిన గొల్లపల్లి మండలం లక్ష్మిపూర్ కు చెందిన తిప్పర్తి సత్యచారి ని శాలువాతో సన్మానించిన మాజీ సర్పంచ్ బలభక్తుల అనిత కిషన్ ఈ కార్యక్రమంలో వెంగలాపూర్ పట్టణ విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షులు మగ్గిడి లక్ష్మణ్ చారి, ఉపాధ్యక్షులు కొండోజి శ్రీనివాస్ చారి, మగ్గిడి రవి, కట్ట రవీందర్, కొండోజి సందీప్, సాయి, లత, రజిత పాల్గొన్నారు.



జనగామ జిల్లా కోలుకొండ వాస్తవ్యులు దామెర హరీష్ కుమార్, శిరీషల పెళ్లిరోజు సందర్భంగా రుద్రమదేవి ఓల్డ్ ఏజ్ హోమ్ లోని అధ్యక్షులు తాల్క లక్ష్మణ్ ఆధ్వర్యంలో వయోవృద్ధుల దీవెనలతో వృద్ధులకు భోజనం, పండ్లు, స్వీట్లు పంపిణీ.

# రాయికల్ పట్టణంలో ఉధృతంగా పారుతున్న పెద్ద చెరువు

### మత్తడిని పరిశీలించిన జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్



రాయికల్ పట్టణంలో ఉధృతంగా పారుతున్న పెద్ద చెరువు మత్తడిని స్థానిక నాయకులతో కలిసి పరిశీలించిన జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్. జగిత్యాల నియోజకవర్గ ప్రజలు అందరూ భారీ వర్షాల సందర్భంగా అప్రమత్తంగా ఉండాలని, అత్యవసర పనీ ఉంటే మాత్రమే బయటకు రావాలని, పొంగుతున్న వాగులు, వంకలు, రోడ్లు దాటే ప్రయత్నం చేయవద్దని ప్రజలను కోరారు. ఏదైనా అత్యవసర పరిస్థితి ఉంటే అధికారుల దృష్టికి, తన దృష్టికి తీసుకురావాలని,ఇదివరకే అధికారులను ఫోన్ ద్వారా అప్రమత్తం చేయటం జరిగింది అని ఎమ్మెల్యే అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మోర్ హనుమాన్లు, కేడిసిసి మాజీ చైర్మన్ పడగల రవీందర్ రెడ్డి, మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు మహేంద్ర బాబు నాయకులు చంద్ర తేజ, షేక్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

# జువ్వాడి భవన్లో రాజశేఖర్ రెడ్డి వర్ధంతి వేడుకలు రాజశేఖర్ రెడ్డితో ప్రత్యేక అనుబంధం ఉండేది

# జువ్వాడి నర్సింగరావు



**కోరుట్ల సెప్టెంబర్ 02 (ప్రజామంటలు):** కోరుట్ల పట్టణ జువ్వాడి భవన్ లో దివంగత నేత మాజీ ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి వేడుకలను కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ జువ్వాడి నర్సింగరావు ఆధ్వర్యంలో పట్టణ, మండల కాంగ్రెస్ పార్టీ నేతలు నిర్వహించారు.ముందుగా వైయస్ రాజశేఖర్ రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం జువ్వాడి నర్సింగరావు మాట్లాడుతూ మహానేత పేదల పెన్నిధి పేద ప్రజల అభ్యున్నతి కోసం కృషి చేసిన మహనీయుడు డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి అన్నారు. రాజశేఖర్ రెడ్డి కుటుంబంతో తనకు ప్రత్యేక అనుబంధం ఉండేదని గుర్తు చేసుకున్నారు. వారు నిరంతరం పేద ప్రజల శ్రేయస్సు కోసమే ఆలోచించే వారన్నారు అలాంటి మహనీయుని కోల్పోవడం తెలుగు ప్రజలకు బాధాకరమైన విషయం అన్నారు. ముఖ్యమంత్రిగా పని చేసినప్పుడు వారి పనితనంతో యావత్ భారతదేశం చూపు తనవైపు చూసేలా చేశారన్నారు. జనం కష్టసుఖాలను తెలుసుకునేందుకు చేపట్టిన ప్రజాప్రస్థానం పాదయాత్రలో ప్రజల, రైతుల కష్టాలను చూసి చలించిపోయారు. ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయడానికి ఎంతో నిజాయితీగా నిబద్ధతతో కృషిచేసిన వ్యక్తి వైఎస్సార్ అన్నారు. పేద ప్రజలకు కార్పొరేట్ వైద్యం కల అనుకుంటే ఆరోగ్యశ్రీ ప్రవేశపెట్టి వారి కలను నిజం చేశారన్నారు. ఉన్నత చదువులు కొనలేమని భావించిన సరస్వతీపుత్రులకు ఫీజు రియంబర్స్మెంట్ వరం కల్పించిన ఘనత వైయస్ రాజశేఖర్ రెడ్డి కే దక్కుతుందన్నారు. నిరుపేద ముస్లిం యువతకు విద్యా ఉద్యోగ అవకాశాల్లో ప్రత్యేక రిజర్వేషన్లు ఆయన తీసుకున్న విప్లవాత్మక నిర్ణయం పండు టాకులకు పింఛను ఇచ్చి వారి ఆకలి తీర్చారు తినే అన్నం మెతుకుల్లో ఆయన కట్టించిన ఇందిరమ్మ ఇళ్లు. మహిళలను తమకు పునర్జన్మ ప్రసాదించిన రాజశేఖర్ ని తలుచుకొని నేటికీ కన్నీరు పెడుతున్నారని కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ జువ్వాడి నర్సింగరావు అన్నారు. దేశానికి వెన్నుముక వ్యవసాయమేనని బలంగా విశ్వసించి సాగునీటి ప్రాజెక్టులకు శ్రీకారం చుడుతూ జలయజ్ఞం ఆరంభించారు. ఆత్మహత్యలు చేసుకున్న రైతులకు అండగా నిలిచారు. రైతు రుణాలు మాఫీ చేసి లక్షల రైతు కుటుంబాలలో వెలుగులు నింపారు. పాదయాత్ర అనంతరం జరిగిన ఎన్నికల్లో విజయం సాధించి 2004 మే నెలలో ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన వైయస్సార్ రెండు రూపాయలకే కిలో బియ్యం, రైతులకు ఉచిత విద్యుత్, 108 అంబులెన్స్ సర్వీస్, ట్రిపుల్ ఐటీల ఏర్పాటు సహా ఎన్నో ప్రజా ప్రయోజన కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. ఇలా తన ప్రజా రంజక పాలనతో ప్రత్యేక స్థానం సంపాదించారన్నారు. ఈ కార్యక్రమంలో కోరుట్ల పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తిరుమల గంగాధర్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొంతం రాజం, పట్టణ కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు ఎంఏ నయీమ్, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షులు ఎలేటి మైపాల్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ పన్నాల అంజిరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పెరుమాండ్ల సత్యనారాయణ, కౌన్సిలర్ ఎంబేరి నాగభూషణం, జిందం లక్ష్మీనారాయణ, మోర్తాడ్ లక్ష్మీనారాయణ, పట్టణ కార్యదర్శి మ్యాకల నర్సయ్య, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అన్నం అనిల్ పుప్పాల ప్రభాకర్, మాజీ కౌన్సిలర్ సోగ్రాభి, శ్రీరాముల అమరేందర్ నేమూరి భూమయ్య, చిట్యాల లక్ష్మీనారాయణ, ఏ ఆర్ అక్బర్, సదుల వెంకటస్వామి, చిలివేరి విజయ్, తెడ్డు విజయ్ కాంగ్రెస్ పార్టీ వివిధ హోదాల నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# వడ్లకొండ రోడ్డు పునరుద్ధరణ పనులను తక్షణమే చేపట్టాలి రోగులకు మెరుగైన చికిత్స, విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలి

### నేటి నుంచి వారం రోజుల పాటు మండలాలు, గ్రామాల్లో డ్రై డే కార్యక్రమం జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



**జనగామ సెప్టెంబర్ 02 (ప్రజామంటలు):** రాష్ట్రవ్యాప్తంగా శనివారం రాత్రి నుంచి భారీ, అతి భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో జనగామ జిల్లాలో జోరు వాన కురిసింది. ఈ క్రమంలో జనగామ మండలంలోని వడ్లకొండ రోడ్డు వరద ఉధృతి ధాటికి కొట్టుకుపోగా, జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ సందర్శించి, పరిశీలించారు. ఈ నేపథ్యంలో తక్షణమే ఈ రోడ్డు పునరుద్ధరణ పనులను చేపట్టాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అధికారులను ఆదేశించారు. అలాగే లింగాల ఘనపురం మండలంలోని నెల్లుట్ల నుంచి కుందారం వైపు వెళ్లే వంతెన వద్ద గల రోడ్డు, కల్వర్టు వరదకు మూలాన కొట్టుకుపోగా, వాటి మరమ్మతుల పనులను కూడా త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. అనంతరం పాలకుర్తి మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి, తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పేషెంట్, స్టాఫ్ రిజిస్టర్లను తనిఖీ చేసి, రోగులకు మెరుగైన చికిత్స అందించాలని, విష జ్వరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, సరిపడా ఔషధ నిల్వలను ఉంచుకోవాలని, నిత్యం రోగులకు వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండాలని సూచించారు. అనంతరం పాలకుర్తిలోని కేజీబీవీ వసతి గృహాన్ని, సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాలలను సందర్శించి, పర్యవేక్షించారు. ఈ సందర్భంగా వసతి గృహంలో కల్పిస్తున్న మౌలిక వసతులను పరిశీలించి, ఎప్పటికప్పుడు పరిశుభ్రత చర్యలు పాటించాలని, విద్యార్థులకు ప్రతిరోజూ ఉపాధ్యాయులు సమయపాలన తప్పనిసరిగా పాటించాలని, విద్యార్థులకు నిత్యం అందుబాటులో ఉంటూ వారి హాజరు శాతాన్ని పెంచాలని సూచించారు. అదే విధంగా విద్యార్థులతో కలిసి కలెక్టర్ భోజనం చేశారు. అనంతరం పాలకుర్తి మండలంలోని గూడూరు గ్రామంలోని ట్రైబల్ వెల్ఫేర్ వసతి గృహాన్ని సందర్శించి, పరిశీలించారు. ఈ సందర్భంగా వసతి గృహంలోని వంటగదిని పరిశుభ్రంగా ఉంచుకోవాలని, శుచికరమైన ఆహారాన్ని విద్యార్థులకు అందించాలని, విద్యార్థులు మంచిగా చదువుకొని ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. అనంతరం ఘనపూర్ (స్టేషన్) లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి, ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో వైద్యులు సరిగ్గా అందుబాటులో లేనందున అగ్రహం వ్యక్తం చేశారు. ప్రతిరోజూ వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండాలని సూచించారు. అదే విధంగా భారీ వర్షాల కారణంగా జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని మండలాలు, గ్రామ పంచాయతీలలో నేటి నుంచి వారం రోజుల పాటు డ్రై డే కార్యక్రమాన్ని చేపట్టాలని మండల ప్రత్యేక అధికారులు, గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారులను ఆదేశించారు. నిన్న సాయంత్రం నుంచి జిల్లాలో వర్షం కాస్త తగ్గుముఖం పట్టడంతో అన్ని మండలాలు, గ్రామాల్లో పరిశుభ్రతా చర్యలు పక్కాగా అమలు చేయాలన్నారు. ఈ నేపథ్యంలో ప్రజలు డెంగ్యూ, చికెన్ గున్యా, టైఫాయిడ్, తదితర విష జ్వరాల బారిన పడకుండా అన్ని గ్రామ పంచాయతీలలో, మునిసిపల్ వార్డులలో శానిటేషన్ పనుల్లో భాగంగా మురుగు కాల్వలను శుభ్రం చేయాలని, కాలనీలలో వర్షపు నీటి నిల్వలను మురుగు కాల్వలకు మళ్ళించాలని, వర్షం ధాటికి రోడ్లపైకి చేరిన చెత్తను తొలగించాలని, ఫాగ్గింగ్, బ్లీచింగ్ చేయాలని సూచించారు. ఈ తనిఖీలో కలెక్టర్ వెంట సంబంధిత అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ఆగ్రహించిన వరద గోదావరి అప్రమత్తమైన తీర జనావళి





**ధర్మపురి సెప్టెంబర్ 02 (ప్రజామంటలు :** రామ కిష్టయ్య సంగన భట్ల): ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా, గోదావరి నది గణనీయంగా పెరిగింది. రెండు రోజులుగా భారీ వర్షాలు కురుస్తుండడం చేత, నది ఎగువ ప్రాంతాల నుండి నదిలో క్రమేపి వరద నీరు చేరుతున్న కారణంగా గోదావరి నీటిమట్టంలో గంటగంటకూ, మార్పు చోటు చేసుకుంటున్నది. నిర్మల్ జిల్లాలోని కడెం ప్రాజెక్టులోనికి భారీగా చేరిన ఇన్ ఫ్లో గణనీయంగా పెరగగా, తదనుగుణంగా ఇన్ ఫ్లో బట్టి అవుట్ ఫ్లో కొన సాగిస్తున్నారు. కడెం నుండి 700 అడుగుల గరిష్ఠ స్థాయికి గాను, సోమవారం ఉదయం 3గంటలకు 696 అడుగుల ఎత్తుకు నీటిని స్థిరంగా ఉండేలా క్రమానుగతంగా18గేట్లను ఎత్తడం ద్వారా గరిష్టంగా 2,77,78 క్యూసెక్కుల నీటిని ఉదయం నుండి వదిలారు. కడెం వరద నీటిని గోదావరి నది లోనికి వదలడంతో, సదరు నీరు ధర్మపురికి క్రమానుగతంగా చేరి, నీటి మట్టం అనుక్షణం పెరిగింది.ఉదయం నడి ఒడ్డున గల శ్రీ సంతోషి మాతా ఆలయం ప్రధాన ఉత్తర ద్వారం దాటి వరదలు పైకి చేరాయి. రాష్ట్ర ప్రభుత్వ విప్ లక్ష్మణ్ కుమార్ ఎప్పటి కప్పుడు నీటి ఉధృతి సమాచారాన్ని అందుకుంటూ అధికారులను అప్రమత్తం చేశారు. సాయంత్రం ధర్మపురిలోని మంగలి గడ్డ వద్దకు ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ చేరుకొని గోదావరిని పరిశీలించి తగు సూచనలు చేశారు. జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్, అధికారులతో సమన్వాయం కలిగి ఎప్పటి కప్పుడు తీసుకోవాల్సిన చర్యలపై ఆదేశించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ధర్మపురి తహశీల్దార్ కృష్ణ చైతన్య, సీఐ రాం నర్సింహా రెడ్డి, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస రెడ్డి, ఎస్ ఐ, తమ సిబ్బందిని సమన్వయ పరిచే విధంగా ఉపక్రమించి, అనుక్షణం సమాచారాన్ని ప్రాజెక్టుల అధికారుల ద్వారా తెలుసుకుని, ఉన్నతాధికారులకు సమాచారం అందిస్తూ, గోదావరి నది ఒడ్డున మకాం వేసి, దేవస్థానం పక్షాన మైకులలో ప్రకటింప చేస్తూ, తీరవాసులను అప్రమత్తం చేసే చర్యలు గైకొన్నారు. రెవెన్యూ అధికారులు గోదావరి తీరాన గల సంతోషి మాత ఆలయం లోనికి నీరు చేరగా, భక్తుల స్నానాలను నిలిపి వేసి, నది ప్రవాహం వద్దకు ఎవరినీ వెళ్లనీయ కుండా కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టారు. తీర గ్రామాల ప్రజలను అప్రమత్తం చేశారు. కడెం ప్రాజెక్టు నుండి వదులున్న నీటిని క్రమంగా తగ్గించిన క్రమంలో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. అలాగే శ్రీరాం సాగర్ ప్రాజెక్టు నుండి అదే క్రమంలో అధిక వరద నీటిని గోదావరి లోనికి వదిలారు. మహారాష్ట్రలో కురుస్తున్న వర్షాలకు శ్రీరా సాగర్ ప్రాజెక్టుకు భారీగా చేరిన ఇన్ ఫ్లో బట్టి 1091 అడుగుల ఎత్తుకు గాను 1088.5 అడుగుల ఎత్తును సరిచూసుకుని, ఉదయం 11.40కి 1లక్ష క్యూసెక్కుల నీటిని వదిలి క్రమేపీ సాయంత్రం 5గంటలకు 40 గేట్ల ద్వారా 2లక్షల నుండి గరిష్టంగా 2,50,000 క్యూసెక్కుల నీటిని గోదావరి లోనికి వదిలారు. రాత్రి వరకు సదరు నీరు ధర్మపురి క్షేత్రం ప్రాంతానికి చేరుకొనున్నందున అధికారులు ప్రజలను అప్రమత్తం చేస్తూ, తగు జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

# అతిధి అధ్యాపకుల కొరకు దరఖాస్తుల ఆహ్వానం

**జగిత్యాల సెప్టెంబర్ 02 (ప్రజామంటలు):** ఎస్.కే.ఎన్.ఆర్. ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల జగిత్యాల లో ఖాళీగా ఉన్న అతిధి అధ్యాపకుల పోస్ట్ లకు అర్హులైన వారినుండి దరఖాస్తులను ఆహ్వానిస్తుందని కళాశాల ప్రిన్సిపల్ ఏ. అశోక్ ఒక ప్రకటనలో తెలిపారు.

ఖాళీల వివరాలు: ఆంగ్లం-3 , తెలుగు -3, కామర్స్ -2, హిస్టరీ 1, మ్యాథమెటిక్స్ 1, ఫిజిక్స్ 1, ఖాళీలు ఉన్నాయని తెలిపారు. పోస్ట్ గ్రాడ్యుయేషన్ లో కనీసం 55 శాతం మార్కులుండి, ఎస్సీ ఎస్టీలకు 50 శాతం మార్క్స్ ఉండాలన్నారు. నెట్, సెట్, పీహెచ్ డి, కలిగిన అభ్యర్థులకు ,టీచింగ్ లో అనుభవం ఉన్న వారికి వెయిటేజ్ ఉంటుందని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు కళాశాలలో, 2.09.2024 నుండి 05.09.2024 వరకు కార్యాలయ సమయంలోనే బయోడెటా మరియు ఒక సెట్ సర్టిఫికెట్ల జిరాక్స్ పత్రాలు సమర్పించి 6వ తేధిన ఉదయం 10.00 గంటలకు తమ ఒరిజినల్ సర్టిఫికెట్స్ తో పాటుగా నేరుగా సర్టిఫికెట్స్ వెరిఫికేషన్ కు హాజరు కావాలని తెలిపారు. అర్హతలు కల్గి, టీచింగ్ లో అనుభవంగల వారికి ,ప్రాధాన్యత ఇవ్వబడును. వివరాలకు ఎస్కేఎన్ఆర్ కళాశాల అకడమిక్ కోఆర్డినేటర్ సాయి మధుకర్ ను 8121513671 నంబర్ కు సంప్రదించాలని కోరారు.

# వై యస్ రాజశేఖర్ రెడ్డి ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయలి



**మెటుపల్లి సెప్టెంబర్ 02 (ప్రజామంటలు):** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతిని టిపిసిసి డెలిగేట్ కల్వకుంట్ల సుజిత్ రావు అదేశాల మేరకు ఘనంగా నిర్వహించారు. జిల్లా సేవాదళ్ అధ్యక్షులు అందె మారుతీ మాట్లాడుతూ వైఎస్సార్ 1949 లో జన్మించి 28 సంవత్సరాలకె ఎమ్మెల్యే గా ఎన్నికయ్యారు ఆరు సార్లు ఎమ్మెల్యే గా నాలుగు సార్లు ఎంపిగా గేలిసి ఓటమి ఎరుగని నేతగా నిలిచారని గుర్తుచేశారు. 2004.సంవత్సరం లో కాంగ్రెస్ పార్టీని గేలిపించి, సీఎం అయిన వెంటనే, రైతులు పడుతున్న కష్టాలను చూసి తోలి సంతకం ఉంచిత కరేంట్ పైల్ మిద పెట్టడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మెట్ పల్లి పట్టణ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు ఖుబుద్దిన్ పాషా, కాంగ్రెస్ సీనియర్ నాయకులు కూన గోవర్ధన్, కోరుట్ల నియోజకవర్గ ఎన్ఎస్ యుఐ వర్కింగ్ ప్రెసిడెంట్ గద్దల భరత రాజ్, కల్లెడ గంగాధర్, ఆనంద్ రెడ్డి, తోగిటి నాగరాజు, సమీర్ సర్కార్, కోరే రాజ్ కుమార్, యండి. అన్వర్ తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా పోలాల అమావాస్య యుక్త శ్రావణ మాస చివరి సోమవారం వేడుకలు







ధర్మపురి సెప్టెంబర్ 02 (ప్రజా మంటలు – రామ కిష్టయ్య సంగన భట్ల): దక్షిణ కాశీగా, హరిహర క్షేత్రంలో తెలుగునేలపై పేరెన్నికని, గంభీర గౌతమీ తీరాన వెలసి సనాతన సాంప్రదాయాలకు నిలయమై, పలు దేవాలయాలు సముదాయంతో విరాజిల్లుతున్న ధర్మపురిలో శ్రావణ మాస సోమవార వేడుకలు సాంప్రదాయ రీతిలో ఘనంగా జరిగాయి. శ్రావణంలో క్షేత్రంలో నెలరోజుల పాటు ప్రత్యేక కార్యక్రమాలు జరుగుతుండగా, సోమవారం హిందువులకు పరమ పవిత్రమైనది. లోకేశ్వరుడు అభయంకరుడైన శంకరుని శ్రావణమాసం అందునా ప్రత్యేకించి, సోమవారం మహన్యాస పూర్వక రుద్రాభిషేకంతో పూజిస్తే శివసా యుజ్యం పొందగలని పురాణాలు విశదీకరిస్తున్నాయి. న్యాసము అనగా ఐక్యము చేసుకోవడం. పూజకు పూర్వం రుద్రుడిని, లింగంలో నిలుపుకుని, తాను రుద్రుడై, ఆ రుద్రుడిని అభిషేకించాలి. అందులకై మహన్యాస పూర్వక రుద్రాభిషేకంతో, కనీసం శ్రావణ సోమవారమైనా శివుని పూజించి, నిరాహారం, ఉపవాసం లేక ఏకభుక్తం చేయాలి. ద్వాదశ మాసాల్లో శ్రావణం, అందునా సోమవారం అత్యంత శ్రేష్ఠమైన దినం. ఈ నేపథ్యంలో శ్రావణ చివరి అమావాస్య యుక్త సోమవారం (సోమవతీ అమావాస్య) క్షేత్రం భక్తజనంతో కిటకిటలాడింది. శివకేశవుల నిలయమైన ధర్మపురిలో పర్వదిన సందర్భంగా సుదూర ప్రాంత భక్తులతో పాటు, స్థానిక సాంప్రదాయాచరణ పరులు గోదావరిలో భారీ వర్షాన్ని సైతం లెక్క చేయకుండా మంగళ స్నానాలు ఆచరించి, వివిధ దేవాలయాలలో దైవ దర్శనాలు చేసుకున్నారు. శ్రావణ సోమవారం సందర్భంగా, క్షేత్రం లోని శ్రీరామలింగేశ్వర, అక్కపెల్లి రాజేశ్వర ఆలయాలలో, మార్కండేయ మందిరంలో, వాడవాడలలో గల శివ పంచాయతనాల యందు మహన్యాస పూర్వక రుద్రాభిషేకం, సకృతావర్తన రుద్రాభిషేకాది ప్రత్యేక పూజలు, సహస్ర నామ పారాయణా కార్యక్రమాలను సాంప్రదాయ వేదోక్తరీతిలో కన్నుల పండువగా, భక్తి ప్రపత్తులతో నిర్వహించారు. శ్రీయోగానంద, ఉగ్ర లక్ష్మీ నారనరసింహ, శ్రీవేంకటేశ్వర, ఆంజనేయ, యమధర్మరాజు, వేణుగోపాల, శ్రీరామ, దత్తాత్రేయ, శ్రీసాయి బాలాజీ, గౌతమేశ్వర ఆలయాలలో అర్చకులు ప్రత్యేక అర్చనలు గావించారు. దేవస్థాన అంతర్గత శ్రీరామలింగేశ్వర ఆలయంలో, దేవస్థానం ఈఓ శ్రీనివాస్, సూపరింటెండెంట్ కిరణ్, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో, అభివృద్ధి కమిటీ సభ్యుల పర్యవేక్షణలో, వేద పండితులు రమేశ శర్మ, ముత్యాల శర్మ, పాలెపు ప్రవీణ్ శర్మ, ఆలయాల అర్చకులు దేవళ్ళ విశ్వనాథ శర్మ, శ్రావణ శాశ్వత నిధి ప్రత్యేక పూజాదులు నిర్వహించారు. శ్రీ అక్కపెల్లి రాజేశ్వ రాలయంలో అర్భకులు బూస ప్రవీణ్, జన మంచి శ్రీనివాస్, వేదవిదులు రుద్రాభిషేకాలు, శాశ్వత నిధి పూజలు సంప్రదాయ రీతిలో ఘనంగా నిర్వహించారు.

# కోరుట్ల వ్యవసాయ మార్కెట్ చైర్మన్ గా పన్నాల అంజిరెడ్డి ప్రమాణ స్వీకారం



**కోరుట్ల సెప్టెంబర్ 02 (ప్రజామంటలు):** జగిత్యాల జిల్లా కోరుట్ల పట్టణంలోని జి ఎస్ గార్డెన్ లో వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం ఆదివారం ప్రమాణ స్వీకారం చేసారు. మార్కెట్ కమిటీ చెర్మన్ గా ఐలాపూర్ గ్రామానికి చెందిన పన్నాల అంజిరెడ్డి, వైస్ చేర్మన్ గా పుల్లూరి వెంకటేష్ గౌడ్ తో పాటు డైరెక్టర్లు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి, కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ జువ్వాడి నర్సింగరావు లకు ఘన స్వాగతం పలికిన కోరుట్ల కాంగ్రెస్ శ్రేణులు. అనంతరం చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ%ొ% మార్కెట్ కమిటీ చైర్మెన్ ప్రమాణ స్వీకారం రోజు వర్షం కురవడం శుభపరిణామం అన్నారు. ఉప ప్రధాని అవుతాననుకుని కేసీఆర్ ఇతర రాష్ట్రాల్లో కోట్లు ఖర్చు పెట్టారని ఆయన విమర్శించారు. గత ప్రభుత్వ హయాంలో రైస్ మిల్లర్లు రైతుల దగ్గర ముక్కు పిండి వసూలు చేశారన్నారు. మిల్లర్ల దగ్గర బీఆర్ఎస్ నేతలు కమీషన్లు వసూలు చేశారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు ప్రభుత్వమని ఆయన చెప్పారు. రైతు రుణమాఫీ చేసి నిజమైన ప్రజా పాలన చూపించింది కాంగ్రెస్ సర్కార్ అని అన్నారు. ఎమ్మెల్యే వివేక్ పాలకవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ జువ్వాడి నర్సింగరావు మాట్లాడుతూ%ొ%. మార్కెట్ అభివృద్ధికి నిరంతరం పనిచేస్తూ రైతులకు అందుబాటులో ఉండాలని, మార్కెట్ కమిటీ సభ్యులు సమన్వయంతో ముందుకు సాగాలని, రైతుల సమస్యలను పరిష్కరించాలని, నూతన పాలక వర్గానికి సూచించారు. అనంతరం నూతన చేర్మెన్ గా ప్రమాణ స్వీకారం చేసిన పన్నాల అంజిరెడ్డి మాట్లాడుతూ%ొ%. నాపై నమ్మకం ఉంచి నాకు చేర్మెన్ పదవి కట్టబెట్టిన నర్సింగరావు అన్నకి రుణ పడి ఉంటానని, చిన్న వయస్సులో పెద్ద బాధ్యత అప్పగించిన నర్సింగరావు అన్నకు నా శిరస్సు వంచి పాదాభివందనం చేస్తున్నా అని అయన అన్నారు. అలాగే పెద్దలు చెప్పిన విధంగా నిరంతరం రైతుల శ్రేయస్సు కొరకు పని చేస్తానని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు, నాయకులు కార్యకర్తలు తదితరు పాల్గొన్నారు.

# దివ్యాంగుల సహాయ ఉపకారణాలకై లబ్దిదారుల ఎంపిక శిబిరాలు

**జనగామ సెప్టెంబర్ 02 (ప్రజామంటలు):** సెప్టెంబర్ 4,5,6 తేదీలలో ఉదయం 9:30 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు దివ్యాంగుల ఉపకరణాలకు లబ్దిదారుల ఎంపిక, నమోదు శిబిరం నిర్వహించనున్నట్లు జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారిణి జయంతి తెలియజేసారు. జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం మహిళ శిశు సంక్షేమం, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ అధ్యక్షతన ఆలింతో, హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో దివ్యాంగులకు సహాయ ఉపకరణాలు (బ్యాటరీ ట్రై సైకిల్, మూడు చక్రాల రిక్షా, సాధారణ వీల్ చైర్, సంక కర్రలు చేతి కర్రలు, హియరింగ్ ఎడ్స్, స్మార్ట్ కెన్ డివైసెస్, టి.యల్.యం. కిట్స్, 4జీ స్మార్ట్ ఫోన్లు..) కొరకు ఈ నెల 4వ తేదీ నుండి 6 తేదీ వరకు ఉదయం 9:30 గంటల నుండి సాయంత్రం 05:00 గంటల వరకు దివ్యాంగుల లబ్దిదారుల ఎంపిక, నమోదుకు శిబిరం నిర్వహించనున్నట్లు వివరించారు. సెప్టెంబర్ 4వ తేదీన పాలకుర్తి మండలం పాలకుర్తి రైతు వేదికలో నిర్వహిస్తున్న శిబిరానికి దేవరుప్పుల, కొండకండ్ల మండలాల దివ్యంగులు మాత్రమే అర్హులుగా పేర్కొన్నారు. అదేవిధంగా సెప్టెంబర్ 5 వ తేదీన స్టేషన్ ఘన్పూర్ మండలం స్టేషన్ ఘనపూర్ రైతు వేదిక లో ఏర్పాటు చేసిన శిబిరానికి జఫర్ ఘఢ్, చిల్పూర్, రమనాథ్ పల్లి మండలాల దివ్యంగులు మాత్రమే అర్హులని తెలియజేశారు. సెప్టెంబర్ 6వ తేదీన జిల్లా కేంద్రంలోని సూర్యాపేట రోడ్డులో ఉన్న సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయము (జిల్లా కలెక్టర్ కార్యాలయం) లో జనగాం రూరల్, మునిసిపాలిటి, లింగాల ఘనపూర్, తరిగొప్పుల, నర్మెట్ట, బచ్చన్నపేట మండలాల దివ్యాంగులు మాత్రమే అర్హులన్నారు.ఈ ఎంపిక, నమోదు శిబిరానికి అర్హులైన దివ్యాంగులు ఈ క్రింది ధ్రువ పత్రాలతో శిబిరానికి హాజరవ్వాలని, 1. పాస్పోర్ట్ సైట్ ఫోటోలు (3), 2. సదరం సర్టిఫికెట్, 3. ఆదాయ ధ్రువీకరణ పత్రము/రేషన్ కార్డు, 4. ఆధార్ కార్డు, 5. యు.డి.ఐ.డి. కార్డు (లేని వారు సెంటర్ లో అప్లై చేసి రిసీప్ట్ అయిన తీసుకురావాలి). ఈ అవకాశాన్ని జిల్లాలోని దివ్యాంగులందరూ సద్వినియోగం చేసుకోవలసినదిగా జిల్లా సంక్షేమ అధికారిణి తెలియజేశారు. గత ఐదు సంవత్సరాలలో దివ్యాంగుల సంక్షేమ శాఖ ద్వారా లబ్ది పొందిన దివ్యాంగులు అర్హులు కారు.గమనిక: ఈ శిబిరం ద్వారా అర్హులైన దివ్యాంగులను గుర్తించడం మాత్రమే జరుగుతుంది. గుర్తించిన అర్హులకు మరొక శిబిరం ద్వారా ముందుగా తెలియజేసి, సహాయ ఉపకరణాల పంపిణీ కార్యక్రమం నిర్వహించబడుతుందన్నారు.

# హిందువులలో అస్పృశ్యత అంటరానితనం ఉండకూడదు

## వి.హెచ్.పి. తెలంగాణ రాష్ట్ర సామాజిక సమరసత ప్రముఖ్ ధనుంజయ్



**ధర్మపురి సెప్టెంబర్ 02 (ప్రజామంటలు) :** రామ కిష్టయ్య సంగన భట్ల): హిందువులలో అస్పృశ్యత, అంటరానితనం ఉండకూడదని, హిందువులందరూ కులాలకు, వర్ణాలకు, వర్గాలకు అతీతంగా పనిచేయాలని విశ్వ హిందూ పరిషత్ తెలంగాణ రాష్ట్ర సామాజిక సమరసత ప్రముఖ్ ధనుంజయ్ అన్నారు. విశ్వహిందూ పరిషత్ ఆవిర్భావం కృష్ణాష్టమి వేడుకలను ధర్మపురి పట్టణంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ తెలంగాణ రాష్ట్ర సామాజిక సమరసత ప్రముఖ్ ధనుంజయ్ పాల్గొని ప్రసంగిస్తూ... విశ్వహిందూ పరిషత్ అనేక సేవా కార్యక్రమాల నిర్వహణ గురించి వివరించారు. విశ్వహిందూ పరిషత్ హిందువుల రక్షణ కోసం హిందూ జాతిని కాపాడడం కోసం పని చేయాలని, ప్రపంచంలో ఉన్న ఏ హిందువు కూడా బాధపడడానికి వీల్లేదన్నారు. హిందువులందరూ కులాల అతీతంగా వర్ణాలకు అతీతంగా వర్గాలకు అతీతంగా పనిచేయాలన్నారు. హిందువులలో అస్పృశ్యత అంటరానితనం ఉండకూడదన్నారు. విశ్వహిందూ పరిషత్ ద్వారా దేశంలో అనేక రకాల సేవ కార్యక్రమాలను నిర్వహించబడుతున్నాయని, అయోధ్యలో భవ్య రామ మందిరం నిర్మించబడిందని,.%శ్రీ% ప్రతి వార వారం సత్సంగం నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈ సమ్మేళనం లో మున్సిపల్ చైర్మన్ సంగి సత్తమ్మ, విశ్వహిందూ పరిషత్ నాయకులు అల్లం దుర్గా ప్రసాద్, కస్తూరి రాజన్న, ముత్యం రమేష్, మామిడాల రవీందర్, ఎలగందుల బుచ్చన్న, ఆర్ఎస్ఎస్ నుండి రంగు లక్ష్మీ నరహరి, గుడ్ల నరహరి, గిరిధర్, సంగి శేఖర్, బెజ్జారపు లవన్ కుమార్, గాజు భాస్కర్, సూరజ్ సత్యనారాయణ, భోగ అనిల్ కుమార్, ఆసం సురేష్, శివ సాయి, బీర్పూర్, బుగ్గారం వెలగటూరు, మండలాల నుండి విశ్వహిందూ పరిషత్ బజరంగ్దళ్ కార్యకర్తలు పాల్గొన్నారు.

# సాయిబాబా గుడి దగ్గరి వాగు, మద్దుల చెరువు పరిశీలించిన భా.జ.పా.నాయకులు



**కోరుట్ల సెప్టెంబర్ 02 (ప్రజామంటలు):** భారతీయ జనతా పార్టీ కోరుట్ల పట్టణ అధ్యక్షులు బింగి వెంకటేష్ ఆధ్వర్యంలో కోరుట్ల పట్టణంలోని సాయిబాబా గుడి దగ్గరి వాగు, మద్దుల చెరువు నుండి ప్రకాశం రోడ్ లో నీరు ప్రవహిస్తున్న లోతట్టు ప్రాంతాలు అలాగే తాళ్ళ చెరువు మత్తడి ప్రదేశాలని సందర్శించడం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర ఓబీసీ మోర్చా కార్యవర్గ సభ్యులు రుద్ర శ్రీనివాస్, కౌన్సిలర్ పెండెం గణేష్, జిల్లా అధికార ప్రతినిధి కస్తూరి లక్ష్మీ నారాయణ, జిల్లా ఓబీసీ మోర్చా కార్యవర్గ సభ్యులు ఉరుమాండ్ల చరణ్ లు మాట్లాడుతూ.... సాయిబాబా గుడి దగ్గర వాగులో మాజీ ఎమ్మెల్యే విద్యాసాగర్ రావు డి.సి.ఎం. వ్యాన్ ఓనర్స్ కి వాగులో స్థలం కేటాయించడంతో వారు మొరం పోసి వాగు స్థలం ఎత్తు పెంచారు.దాని వలన వాగు నీరు ఉధృతి ఎక్కువ అయినప్పుడు స్మశానాన్ని తాకుతూ ప్రవహిస్తుంది. దీని ద్వారా రెండున్నర కోట్ల సొమ్ముతో నిర్మించుకున్న స్మశానం శిథిలావస్థకు చేరుకుంది అలాగే బాఫర్ జోన్, ఎఫ్.టి.ఎల్. పరిధిలోని కబ్జాలకు గురైన ప్రభుత్వ భూములను గుర్తించి నాళాలను నిర్మించి వరద నీరు సక్రమంగా ప్రవహించేలా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ బట్టు తిరుపతిని పాలక వర్గాన్ని కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రధాన కార్యదర్శి చెట్లపెల్లి సాగర్, ఇట్యాల నవీన్, లీగల్ సెల్, సూతరి శ్రీనివాస్, గుద్దేటి రాజేందర్ యువ మోర్చా అధ్యక్షులు కలాల సాయిచందు సీనియర్ నాయకులు తునికి భాస్కర్, పోతుగంటి శ్రీనివాస్, బీజేవైఎం ఉపాధ్యక్షులు ధమ్మా సంతోష్, సాయి తదితరులు పాల్గొన్నారు.

# లోకమాత పోచమ్మ తల్లి ఆలయంలో ఘనంగా గోపాల కాలువలు



**జగిత్యాల సెప్టెంబర్ 02 (ప్రజామంటలు):** జగిత్యాల పట్టణంలోని గాజుల పోచమ్మ ఆలయ వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా సోమవారం సాయంత్రం గోపాల కాలువలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా డాక్టర్ లింగ శ్రీనివాస్ ఆధ్వర్యంలో నవదుర్గ మాతల వేషధారణలు ఆహుతులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.



ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి వర్ధంతి సందర్భంగా ఉన్న వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించిన రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జీ. చిన్నారెడ్డి

# శాస్త్రీయ సమాజ స్థాపనే జనవిజ్ఞాన వేదిక లక్ష్యం

## జెవివి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనాథ్



**జనగామ సెప్టెంబర్ 02 (ప్రజామంటలు):** ప్రజలలో ఉన్న మూఢవిశ్వాసాలను నిర్మూలించడానికి ,విద్యార్థులలో శాస్త్రీయ విజ్ఞాన అభివృద్ధికి జనవిజ్ఞాన వేదిక నిరంతరం కృషి చేస్తున్నదని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనాథ్ అన్నారు. జనగామ జిల్లా జెవివి 5 వ జిల్లా మహాసభలు జిల్లా అధ్యక్షులు మర్రెడ్డి అధ్యక్షతన జరిగాయి. ముఖ్య అతిథిగా హాజరైన శ్రీనాథ్ మాట్లాడుతూ సాంకేతికత పెరుగుతున్న ప్రపంచంలో మన దేశం అభివృద్ధి సాధించాలంటే శాస్త్రీయ విజ్ఞానం తో ముందుకువెళ్లాలి. విద్యార్థులలో శాస్త్రీయ భావజాలాన్ని పెంచడం తో పాటు ప్రజలలో ఉన్న మూఢ విశ్వాసాలను పారద్రోలాడానికి నిరంతరం జెవివి కృషి చేస్తున్నదని అన్నారు. ఈ సందర్భంగా నూతన జిల్లా కమిటీ ని రాష్ట్ర కార్యదర్శి వెంకటేష్ ఎన్నికల అధికారిగా వ్యవహరించి ఎన్నుకున్నారు. జెవివి జనగామ జిల్లా నూతన కమిటీ గౌరవాధ్యక్షులు డాక్టర్ గోపాల్ రెడ్డి, డాక్టర్ మనశ్విని, సాంబరాజు యాదగిరి, అధ్యక్షులు రవీందర్ ప్ర.కార్యదర్శి ఉమాదేవి, కోశాధికారి లక్ష్మణ్ జీ, ఉపాధ్యక్షులు చంద్రశేఖర్ రావు, మర్రెడ్డి, సత్యప్రకాశ్, శోభన్ బాబు, కార్యదర్శులు శోభన్ రెడ్డి, శ్రావణ్, సత్తయ్య, యాదగిరి, నీలకంఠం, కృష్ణ వివిధ విభాగాలకు బాధ్యులుగా కనకయ్య, నీరజ, శ్రీనివాస చారి,శ్రీనివాస రావు, సరస్వతి, లలిత, రవీందర్ లను ఎన్నుకున్నారు.

# కృష్ణా నదిలో పోటెత్తుతున్న వరద..! వణికిపోతున్న బెజవాడ వాసులు

**అమరావతి,(ప్రజా మంటలు) :** కృష్ణానది వరద 12 లక్షల క్యూసెక్కులు చేరుతుందనే అంచనా నేపథ్యంలో ఉమ్మడి కృష్ణా జిల్లా వాసుల్లో ఆందోళన మొదలైంది.. ప్రకాశం బ్యారేజ్ దిగువున ఉన్న విజయవాడ సిటీ, పెనమలూరు, పామర్రు, అవనిగడ్డలకు ముప్పు వంచిఉన్న నేపథ్యంలో..పెరుగుతున్న వరద దెబ్బకి వణికిపోతున్నారు జిల్లా వాసులు.. ఇప్పటికే సిటీలో ఇళ్లను వదిలి వెళ్తున్నారు ప్రజలు.. పామర్రులో పూర్తిగా లంక గ్రామాలు నీటమునిగాయి.. అవనిగడ్డ ఉల్లిపాలెం వంతెన దగ్గర కట్ట బలహీనం కావడంతో మరమ్మత్తు చర్యలు చేపట్టారు.. వరద నీటి ఉధృతి పెరిగితే ముంపునకు గురవుతమని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.. ఇప్పటికే వందల ఎకరాల్లో వాణిజ్య పంటలు నీట మునిగాయి.. అయితే, వర్షం తగ్గుముఖం పడ్డటం.. ఈ రోజు అంతగా వర్షాలు కురవకపోవడంతో.. వరద ఉధృతి తగ్గుతుందని ఆశాభావంతో ఉన్నారు జిల్లా వాసులు.

EDITED, PRINTED AND PUBLISHED BY CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI SHARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE. EDITOR : CH V. PRABHAKAR RAO, RNI T.C. TELTEL01938. FILE NO.1349985 PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com